# జర్నలిస్ట్ డైరీ
తెలుగు దినపత్రిక





సంపుటి :12 సంచిక :318 సోమవారం 20-7-2026 పేజీలు:8 వెల:3 https://www.epaperjournalistdiary.com/




## నాగోలు మూసీ వద్ద కింద పడిపోయిన జాతీయ జెండా

# పట్టించుకోని అధికారులు.

**జర్నలిస్ట్ డైరీ:**
**జూలై 19 ఎల్బీనగర్**

నాగోలు మూసి వద్ద ఏర్పాటు చేసిన జాతీయ జెండా, నిర్వహణ లోపం కారణంగా చిరిగిపోయి కింద పడిపోయింది. సోమవారం రాత్రి కింద పడిపోయిన జాతీయ జెండా బుధవారం రాత్రి అక్కడ ఉన్న కింద స్థాయి సిబ్బంది తీసి వక్క పెట్టారు. జాతీయ జెండా నేలపై పడి ఉండటం స్థానికంగా తీవ్ర ఆగ్రహాన్ని కలిగిస్తోంది. స్వాతంత్ర్య చిహ్నమైన జాతీయ జెండా పట్ల అధికార యంత్రాంగం చూపిస్తున్న నిర్లక్ష్యంపై ప్రజలు మండిపడుతున్నారు. నాగోలు మూసీ నదీ తీరాన ఏర్పాటు చేసిన జాతీయ జెండా స్తంభం వద్ద ఉన్న ఇనుప గొలుసులు (రోప్స్) తెగిపోవడంతో జెండా చిరిగిపోయి, నేలపై పడిపోయింది. మునీ రివర్ ఫ్రంట్ డెవలప్మెంట్ కార్పొరేషన్ అధికారులు ఎటువంటి మరమ్మతలు చేపట్టకుండా చేయకుండా వదిలేశారు. జాతీయ జెండా గౌరవానికి భంగం వాటిల్లకుండా, వెంటనే అక్కడ మరమ్మతులు చేపట్టాలని, కొత్త జెండాను గౌరవప్రదంగా ఆవిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు. బాధ్య తారాహిత్యంగా వ్యవహరిస్తున్న అధికారులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని, జాతీయ జెండా పట్ల తగిన గౌరవాన్ని ప్రదర్శించేలా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.







# కేసీఆర్‌ను తిడితే నీళ్లు రావు

- గోదావరిని ఎత్తిపోస్తేనే వస్తాయి
- ప్రకృతి వల్ల వచ్చిన కరువు కాదు..?సీఎం నిర్లక్షం వల్ల వచ్చింది
- సీఎం రేవంత్‌రెడ్డిపై హరీశ్‌రావు ఫైర్
- కాళేశ్వరం నీళ్ల కోసం చిన్నకోడూరు రైతుల పాదయాత్ర

**చిన్నకోడూరు**

మాజీ సీఎం కేసీఆర్‌ను తిడితే కాలువల్లోకి, చెరువుల్లోకి నీళ్లు రావని.. గోదావరిని ఎత్తిపోస్తేనే నీళ్లొస్తాయనే వాస్తవాన్ని సీఎం రేవంత్‌రెడ్డి గ్రహించాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు వ్యతిరేక విధానాలపై ఆయన ఫైర్ అయ్యారు. ఆదివారం సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండల రైతులు స్వచ్ఛందంగా చేపట్టిన 15 కిలోమీటర్ల మహా పాదయాత్రలో హరీశ్‌రావు పాల్గొని మాట్లాడారు. కరువు నుంచి బయటపడేందుకు వెంటనే కాళేశ్వరం మోటార్లు ఆన్ చేయాలని డిమాండ్ చేశారు. . ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేసీఆర్‌పై రాజకీయ పగతో కాళేశ్వరం మోటార్లను ఆన్ చేయడం లేదని విమర్శించారు. కేసీఆర్‌ను తిడితే నీళ్లు రావు, గోదావరిని ఎత్తిపోస్తేనే వస్తాయనే వాస్తవాలను ప్రభుత్వ పెద్దలు గ్రహించాలని హితవు పలికారు. వెంటనే పంపులు ఆన్ చేసి రంగనాయక సాగర్, మల్లన్న సాగర్, కొండపోచమ్మ సాగర్‌లను నింపాలన్నారు. మోటార్లు ఆన్ చేయకుండా 70 టీఎంసీల నీళ్లను ఆంధ్రాకు వదిలేశారని విమర్శించారు. పదేండ్ల కేసీఆర్ హయాంలో ఎన్నడూ కరవు రాలేదన్నారు. రైతులు ఫోన్ చేస్తే కాలువ గేట్లు ఎత్తి పంటలు పారించారన్నారు.


-మిగతా 2 లో


## ఆగస్టు 3 వరకు గాంధీ భవన్‌కు

# రావద్దు

### ఎస్ఐఆర్‌పై నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవు

- కొందరు హైదరాబాద్‌లోనే కూర్చుని పని చేయట్లేదు
- లీడర్లు పూర్తిగా క్షేత్రస్థాయిలో ఉండాలి
- బీఎల్‌ఏ రిపోర్టులపైనే ఆధారపడొద్దు
- గాంధీ భవన్ చుట్టూ తిరిగితే పదవులు రావు
- వచ్చే 10 రోజులు నియోజకవర్గాల్లో పర్యటించాలి
- రాష్ట్ర కాంగ్రెస్ నేతలకు సీఎం రేవంత్ వార్నింగ్



**హైదరాబాద్ -**

ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మరోసారి పార్టీ నాయకత్వాన్ని అప్రమత్తం చేశారు. ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించబోమని స్పష్టం చేశారు. ఓటర్ల హక్కులకు భంగం కలగకుండా ప్రతి నాయకుడు క్షేత్రస్థాయిలో ఉండి ప్రక్రియను పర్యవేక్షించాలని ఆదేశించారు. ఎస్ఐఆర్‌పై నేడు నిర్వహించిన వర్చువల్ సమీక్షలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్, రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జి మీనాక్షి నటరాజన్, ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, నియోజకవర్గ ఇంచార్జిలు, ఎస్ఐఆర్ సమన్వయకర్తలు పాల్గొన్నారు.


-మిగతా 2 లో




## జమ్మూకశ్మీర్‌లో

# జలప్రళయం

- 17 మంది మృతి.. నలుగురు గల్లంతు
- వివిధ ప్రాంతాలపై కుప్పకూలిన ఇళ్లు
- నీటి ప్రవాహంలో కొట్టుకుపోయిన బస్సులు
- పూంచ్‌లో 77, రాజౌరీలో 103 మి.మీ.ల వర్షపాతం
- అమర్‌నాథ్, వైష్ణోదేవి యాత్రలు రద్దు
- 23 వరకు భారీ వర్ష సూచన

**రాజౌరి/జమ్మూ**

జమ్మూకశ్మీర్‌లోని పూంచ్, రాజౌరి జిల్లాల్లో భారీ వర్షాలు, మెరుపు వరదలు కారణంగా కనీసం 17 మంది మరణించారు. ఐదు గురు గల్లంతయ్యారు. 16 మంది మృతదేహాలను వెలికితీసినట్లు అధికారులు తెలిపారు. శనివారం రాత్రి నుంచి ఆదివారం వరకు 28 గంటల కాలంలో నివాస ప్రాంతాలు ముంచెత్తడంతో ఇళ్లు కూలిపోయాయి. మృతుల సంఖ్య మరింత పెరగవచ్చని అధికారులు తెలిపారు. పూంచ్ జిల్లాలోని సూరన్ కోట్ తహసీల్‌లో అత్యధిక నష్టం వాటిల్లింది. తప్పిపోయిన వారిని గుర్తించేందుకు సహాయక బృందాలు


-మిగతా 2 లో





# సూపర్ సింధు

- జపాన్ ఓపెన్ టైటిల్ వశం
- ఫైనల్లో యమగూచిపై ఘన విజయం

**టోక్యో (జపాన్)**

భారత అగ్రశ్రేణి షట్లర్, తెలుగు తేజం పి.వి సింధు చరిత్ర సృష్టించింది. జపాన్ ఓపెన్ సూపర్ 750 టైటిల్ సాధించిన తొలి భారత క్రీడాకారిణిగా నిలిచింది. ఆదివారం జరిగిన మహిళల సింగిల్స్ ఫైనల్లో మూడుసార్లు ప్రపంచ చాంపియన్ అకానె యమగూచి (జపాన్)పై 21-17, 21-17తో పి.వి సింధు వరుస గేముల్లో గెలుపొందింది. 50 నిమిషాల టైటిల్ పోరు థ్రిల్లర్‌లో అన్‌సీడెడ్ సింధు అద్భుత విజయం సాధించింది. 2024 సయ్యద్ మోడీ ఇంటర్నేషనల్ (సూపర్ 300) తర్వాత సింధుకు ఇదే తొలి టైటిల్ కాగా.. 2022 సింగపూర్ ఓపెన్ (సూపర్ 500) తెలుగు తేజానికి ఇదే తొలి మేజర్ టైటిల్. 31 ఏండ్ల వయసులో జపాన్ ఓపెన్ విజేతగా నిలిచిన సింధు.. ఈ ఘనత సాధించిన తొలి భారత షట్లర్‌గా రికార్డు నెలకొల్పింది. మిక్సడ్ డబుల్స్‌లో టాప్ సీడ్ చైనా జోడీ ఫెంగ్, పింగ్‌లు విజేతలుగా నిలువగా.. పురుషుల సింగిల్స్‌లో క్రిస్టో పాపావ్ (ఫ్రాన్స్) టైటిల్ సాధించాడు. మహిళల డబుల్స్‌లో కిమ్, కాంగ్ (దక్షిణ కొరియా), పురుషుల డబుల్స్‌లో ఫజర్, ఫిక్రి (ఇండోనేషియా) చాంపియన్లుగా అవతరించారు.


-మిగతా 2 లో


# నేడు సీజేపీ పార్లమెంట్ మార్చ్




- ప్రధాన్ రాజీనామాకు డిమాండ్
- అడ్డుకుంటే ఢిల్లీ మొత్తం నిరసనకారులతో నిండుతుంది
- కాక్రోచ్ జనతా పార్టీ ప్రకటన
- ‘మార్చ్’ను విజయవంతం చేయాలని వాంగ్‌చుక్ పిలుపు

**న్యూఢిల్లీ -**

నీట్ పరీక్ష లీకేజీకి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ కాక్రోచ్ జనతా పార్టీ సోమవారం పార్లమెంట్ మార్చ్ చేపడుతోంది. వర్షాకాల సమావేశాల నేపథ్యంలో జరుగుతున్న ఈ నిరసన దేశవ్యాప్తంగా సంచలనంగా మారింది. ‘చలో సంసద్’లో పాల్గొనే వారికి సీజేపీ పార్టీ కీలక సూచనలు చేసింది. ‘చలో సంసద్’లో పాల్గొనే వారు రాజకీయ పార్టీల


-మిగతా 2 లో


## గాజాకు మద్దతుగా
# లండన్‌లో భారీ ర్యాలీ




2 లో

# కేసీఆర్‌ను తిడితే నీళ్లు రావు

(మొదటి తరువాయి)

ప్రస్తుత కరవు ప్రకృతి వైపరిత్యం వల్ల వచ్చింది కాదని.. కాంగ్రెస్ ప్రభుత్వం, రేవంత్ రెడ్డి తెచ్చిన కరవు అంటూ మండిపడ్డారు. రైతులకు రూ.35 వేల కోట్ల రుణమాఫీ చేస్తామని చెప్పి, కేవలం రూ.18వేల కోట్లు మాత్రమే వేసి సగం మంది రైతుల్ని మోసం చేశారన్నారు. మూడు పంటలకు సంబంధించిన రూ.19 వేల కోట్ల రైతు బంధుకు ఎగనామం పెట్టారని విరుచుకుపడ్డారు. కేసీఆర్ తెచ్చిన రైతుబీమాను పూర్తిగా నిలిపివేశారన్నారు. గతంలో ఎరువుల కొరత లేకుండేదని, నేడు యూరియా కోసం యాప్‌లు పెట్టి రైతులను ఇబ్బంది పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ హయాంలో 24 గంటలు కరెంట్ ఉంటే, ప్రస్తుతం 10 గంటలు కూడా రావడం లేదని ఆరోపించారు. యాసంగి వడ్ల కొనుగోళ్లలో క్వింటాల్‌కు 4 కిలోల తరుగు తీసి మిల్లర్ల చేతుల్లో రేవంత్ రెడ్డి తోలుబొమ్మగా మారారని విమర్శించారు. లోక్‌సభ ఎన్నికల కోసం భద్రాద్రి రాముడు, యాదాద్రి నరసింహస్వామి, కొమరవెల్లి మల్లన్నలపై ఒట్లు వేసిన రేవంత్ రెడ్డి మాట తప్పారన్నారు. దేవుళ్లను మోసం చేసినందుకే రాష్ట్రానికి ఈ అరిష్టం, కరవు పట్టిందని దుయ్యబట్టారు. రేవంత్ రెడ్డి హిట్లర్‌లా ప్రవర్తిస్తూ.. కాళేశ్వరం మోటర్లను ఆన్ చేయాలని కోరిన రిటైర్డ్ ఇంజనీర్లను జైల్లో పెడతానని బెదిరించడం సమంజసం కాదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం భేషజాలకు పోకుండా కన్నెపల్లి పంపులు ఆన్ చేయాలన్నారు. లేకపోతే చిన్నకోడూరు రైతుల స్ఫూర్తితో అన్ని మండలాల్లో పోరాటాన్ని ఉధతం చేస్తామన స్పష్టం చేశారు. రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలు మళ్లీ కేసీఆర్ పాలనను కోరుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, రాష్ట్ర నాయకులు వేలేటి రాధాకృష్ణశర్మ, బీఆర్ఎస్ మండలాధ్యక్షులు కాముని శ్రీనివాస్, మాజీ ఎంపీపీ కూర మాణిక్య రెడ్డి, సిద్దిపేట మాజీ మార్కెట్ కమిటీ చైర్మెన్ పాల సాయిరాం, టిఆర్ఎస్ నాయకులు ఉమేష్ చంద్ర, మేడికాయల వెంకటేశం, జంగిటి శ్రీనివాస్ , రైతులు తదితరులు పాల్గొన్నారు.

# జమ్మూకశ్మీర్‌లో జలప్రళయం

(మొదటి తరువాయి)

ప్రయత్నాలు చేస్తున్నాయి. నిరంతర వర్షాలకు రోడ్లు దెబ్బతినడంతో కష్టాలు పెరిగాయి. పూంచ్‌లో 77 మిల్లీమీటర్లు, రాజౌరీలో 103 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

**వివిధ ప్రాంతాలపై కుప్పకూలిన ఇళ్లు**

సంఘటనా స్థలానికి చేరుకున్న ఆర్మీ బృందాలు ఒక ఇంటిని కట్టెలతోపాటు ఇంటి గోడ సిమెంట్ కింద శిథిలాల కింద చిక్కుకున్నారు. సహాయక బృందాలు 60 ఏళ్ల హస్నాబీ మరియు రెండేళ్ల ఫాయాన్ హుస్సేన్ మృతదేహాలను బయటకు తీశాయి. మిగిలిన ఇద్దరురైన్ ఒక మహిళ, నలుగురు పిల్లలు ఉన్నారు. గాల్లింజ్ ఆపరేషన్ కొనసాగుతోంది. జునాబుంద్ గ్రామంలో 28 ఏళ్ల నజీరా కౌసర్ ఇల్లు కూలిపోవడంతో మరణించింది. గాయపడ్డవారికి ఆమె భర్త ముస్తాక్ హుస్సేన్, ముగ్గురు పిల్లలను ఆస్పత్రికి తరలించారు. సురన్ కోట్ లో 22 ఏళ్ల షాహీద్ అన్వర్ ఇంటి కూలిపోవడంతో ప్రాణాలు కోల్పోయాడు. మల్హోట్ లో ఇరామ్ అనే చిన్నారి నీటి ప్రవాహంలో మునిగిపోయింది. చందక్ ప్రధాన వంతెన దగ్గర ఒక మహిళ మృతదేహాన్ని నీటి నుంచి బయటకు తీశారు. పూంచ్ హవేలీ తహసీల్ లో ఆరు ఇళ్లు కూలిపోవడంతో ఒకరు మృతి చెందగా మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. రాజౌరీ పట్టణంలో నదిలో ఒక మహిళ మృతదేహం లభ్యమైంది. మెరుపు వరదలతో రాజౌరీలో బెలా కాలనీలో కార్లు, బైకులు, ఇతర వాహనకవాహనాలు కొట్టుకుపోయాయి. కోట్ల రూపాయల విలువైన ఆస్తి, వ్యవసాయ భూములు దెబ్బతిన్నాయి.

**అమర్‌నాథ్, వైష్ణోదేవి యాత్రలు రద్దు**

అమర్‌నాథ్, వైష్ణో దేవి యాత్రలను అధికారులు రద్దు చేశారు. కత్రా నైట్, వైష్ణోదేవి ప్రొఫైల్ లో ప్రజలు కొండల నీటి ప్రవాహాల కారణంగా రాకుండా నిరోధించారు. చార్ సరుస్సు, నితీష్ సరస్సులతో పాటు ఇతర కార్యక్రమాలు నిలిపారు. జెన్యం నది, ఇతర నదుల్లో ఇసుక తవ్వకాలు నిలిపేశారు.

**23వరకు భారీ వర్షసూచన**

శ్రీనగర్‌లో భారీ వర్షాలు కురిసాయి. జూలై 19 నుంచి 23 వరకు భారీ వర్షాలు, కొండచరియలు విరిగిపడటం, మెరుపువరదలు సంభవించే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ హెచ్చరించింది. జమ్మూ ప్రాంతంలో ఎక్కువ ప్రభావం ఉంటుంది. జమ్మూ-శ్రీనగర్ హైవే, ఇతర రోడ్లు తెరిచి ఉన్నప్పటికీ ఒకేసారిగా ఉపయోగం రాకుండా ఉండాలని ప్రజలకు అధికారులు సూచించారు.

# సూపర్ సింధు

(మొదటి తరువాయి)

**నువ్వా..నేనా**

మహిళల సింగిల్స్ ఫైనల్ హోరాహోరీగా సాగింది. లోకల్ స్టార్ యమగూచి ఈ ఏడాది సింధుపై ఆడిన రెండు మ్యాచుల్లోనూ గెలుపొందింది. సింధు వరుసగా క్వార్టర్స్, సెమీఫైనల్లో ప్రత్యర్థుల వాకోవర్ ఇవ్వటంతో చెమటపట్టకుండా ఫైనల్‌కు చేరుకుంది. రెండు సార్లు ఒలింపిక్ పతక విజేత సింధు.. టైటిల్ పోరులో సత్తా చాటింది. తొలి గేమ్‌లో 3-0తో మందంజ వేసింది. యమగూచి పుంజుకుని 5-5తో స్కోరు సమం చేసినా సింధు 9-6తో మెరిసింది. విరామ సమయానికి 9-11తో సింధు వెనుకంజ వేసింది. కానీ విరామం తర్వాత సింధు రెచ్చిపోయింది. వరుస పాయింట్లు సాధించింది. 12-12తో స్కోరు సమం చేయటంతో పాటు 16-12, 17-15తో ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. 38 షాట్ల సుదీర్ఘ ర్యాలీలో పైచేయి సాధించిన యమగూచి 17-17తో సమవుజ్జీగా నిలిచింది. కానీ, ఇక్కడ కచ్చితమైన స్మాష్‌లు, క్రాస్ కోర్టు డ్రాప్స్‌తో సింధు వరుసగా నాలుగు పాయింట్లు ఖాతాలో వేసుకుంది. తొలి గేమ్‌ను 21-17తో సొంతం చేసుకుంది. కీలక రెండో గేమ్‌లోనూ సింధు జోరు తగ్గలేదు. యమగూచిపై ఎదురుదాడి చేస్తూ పాయింట్లు సాధించింది. 8-3, 14-7తో ముందంజలోకి దూసుకెళ్లింది. యమగూచి 17-19తో రేసులోకి వచ్చే ప్రయత్నం చేసినా.. సింధు 21-17తో రెండో గేమ్‌తో పాటు జపాన్ ఓపెన్ టైటిల్‌ను ఎగరేసుకుపోయింది.

# నేడు సీజేపీ పార్లమెంట్ మార్చ్

(మొదటి తరువాయి)

జెండాలకు బదులుగా జాతీయ జెండాను చేతిలో పట్టుకోవాలి. రాజ్యాంగ ప్రతిని లేదా గాంధీ, అంబేద్కర్, భగత్‌సింగ్‌లలో ఎవరో ఒకరి ఫొటోలను తీసుకురావాలి. ర్యాలీలో జై హింద్, భారత్ మాతాకీ జై, ఇంక్విలాబ్ జిందాబాద్, జై భీమ్ లాంటి అనుకూల నినాదాలు చేయాలి. శాంతి యుతంగా, అహింసావాదులుగా మార్చ్‌లో పాల్గొనాలని సీజేపీ తెలిపింది.

**కేంద్రం పెద్ద తప్పు చేసింది**

సోనమ్ వాంగ్‌చుక్‌ను కిడ్నాప్ చేసి కేంద్ర ప్రభుత్వం పెద్ద తప్పు చేసిందని కాక్రోచ్ జనతా పార్టీ తీవ్ర విమర్శలు చేసింది. ఈ మేరకు ఎక్స్‌లోని సీజేపీ బ్యాకప్ అకౌంట్ సీజేపీ ఈజ్ బ్యాక్‌లో అభిజీత్ దీప్కే వీడియోను పోస్టు చేసింది. 'నిరాహార దీక్ష చేస్తున్న సోనమ్ వాంగ్‌చుక్‌ను కిడ్నాప్ చేసి కేంద్రం పెద్ద తప్పు చేసింది. ఆ తప్పుతో జంతర్‌మంతర్ మొత్తం నిరసనకారులతో నిండిపోతోంది. మీరు మమ్మల్ని అడ్డుకుంటే ఢిల్లీ మొత్తం నిరసనకారులతో నిండిపోతుంది. బీజేపీకి చెందిన 30 నుంచి 40 మంది గూండాలు, ఢిల్లీ పోలీసులు మా నిరసన ప్రదేశంలోకి చొరబడ్డారు. వారంతా దేశ వ్యతిరేక నినాదాలు చేసి ఈ ప్రాంతాన్ని రణరంగంలా మార్చేందుకు కుట్ర చేస్తున్నారు. వారిని మేం తీవ్రంగా వ్యతిరేకిస్తాం' అని సీజేపీ వెల్లడించింది.

**మార్చ్‌ను విజయవంతం చేయండి..**

పర్యావరణ ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్ దవాఖాన నుంచి మొదటి ప్రకటన చేశారు. కాక్రోచ్ జనతా పార్టీ నిర్వహించనున్న పార్లమెంట్ మార్చ్‌లో పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు సోనమ్ తెల్లకాగితంపై రాసిన నోట్‌ను ఆయన భార్య గీతాంజలి ఆంగ్మో ఎక్స్‌లో పోస్టు చేశారు. కాగా పార్లమెంట్ మార్చ్‌కు పోలీసులు అనుమతి నిరాకరించినట్టు తెలుస్తోంది.

# ఆగస్టు 3 వరకు గాంధీ భవన్‌కు రావద్దు

(మొదటి తరువాయి)

ఎస్ఐఆర్ బాధ్యతలు అప్పగించిన మంత్రులు, ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ చైర్మన్లు, పార్టీ ఇన్‌ఛార్జిలంతా తప్పనిసరిగా క్షేత్రస్థాయిలో పనిచేయాలని సీఎం ఆదేశించారు. జిల్లా వారీగా మంత్రులు పూర్తిస్థాయి పర్యవేక్షణ చేపట్టాలని, చివరి బాధ్యత వారిదే ఉంటుందని స్పష్టం చేశారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సమన్వయ బాధ్యతలను మరింత సమర్థంగా నిర్వహించాలని సూచించారు. ఎస్ఐఆర్ గడువును ఆగస్టు 3 వరకు పొడిగించడాన్ని అవకాశంగా మలుచుకోవాలని రేవంత్‌రెడ్డి అన్నారు. సోమవారం నుంచి 10 మంది ఇన్చార్జి మంత్రులు జిల్లాల వారీగా సమీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. పార్లమెంట్ సమావేశాల్లో పాల్గొంటున్న ఎంపీలు తమకు కేటాయించిన ప్రాంతాల్లో సమీక్షలు కొనసాగించాలని ఆదేశించారు. బాధ్యతలు నిర్లక్ష్యం చేస్తే ఎంపీలపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇప్పటివరకు రాష్ట్రంలోని 119 అసెంబ్లీ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో 489 ఎస్ఐఆర్ సమావేశాలు నిర్వహించినట్లు సీఎం తెలిపారు. వెనుకబడిన నియోజకవర్గాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. కొంతమంది నాయకులు హైదరాబాద్‌కే పరిమితమై పని చేయడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆగస్టు 3 వరకు గాంధీభవన్‌కు ఎవరూ రావొద్దని సీఎం స్పష్టం చేశారు. చైర్మన్ పదవులు, పార్టీ పోస్టుల కోసం గాంధీభవన్ చుట్టూ తిరిగేవారికి నియామకాలు ఉండవని తేల్చిచెప్పారు. జులై 30న మరోసారి సమగ్ర సమీక్ష నిర్వహించి అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా నివేదికలు పరిశీలిస్తామని వెల్లడించారు. బూత్ లెవల్ అధికారుల (బీఎల్ఓ) నివేదికలపై మాత్రమే ఆధారపడొద్దని సీఎం సూచించారు. పార్టీ తరపున పనిచేస్తున్న బూత్ లెవల్ ఏజెంట్ల (బీఎల్ఏ) నివేదికలను కూడా తప్పనిసరిగా పరిశీలించాలని ఆదేశించారు. పార్టీ బీఎల్ఏలతో నిరంతరం సమన్వయం కొనసాగించాలని, క్షేత్రస్థాయిలో వారి సేవలను సమర్థంగా వినియోగించుకోవాలని సూచించారు. రానున్న పది రోజులు నాయకులంతా నియోజకవర్గాల్లోనే పర్యటించాలని రేవంత్‌రెడ్డి చెప్పారు. గాంధీభవన్ బృందం బీఎల్ఏ, బీఎల్ఓ నివేదికలను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. అత్యుత్తమంగా పనిచేసిన 100 మంది బీఎల్ఏలకు రాహుల్ గాంధీని కలిసే అవకాశం కల్పించడంతో పాటు ఆయనతో ఫోటో దిగే అవకాశం కూడా ఇస్తామని ప్రకటించారు.

# గాజాకు మద్దతుగా లండన్‌లో భారీ ర్యాలీ

**-కొత్త ప్రధాని చర్యలు తీసుకోవాలని డిమాండ్**
**-ఇజ్రాయిల్‌పై ఆయుధనిషేధం విధించాలి**
**-నెతన్యాహు ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలి**
**-ఆండీ బర్న్‌హామ్‌కు ప్రదర్శనకారుల డిమాండ్**



గాజాపై ఇజ్రాయిల్ సాగిస్తున్న జాతి హనన యుద్ధానికి నిరసనగా బ్రిటిష్ రాజధాని లండన్ లో భారీ ర్యాలీ నిర్వహించారు. కాబోయే యూకే ప్రధాని తక్షణ చర్యలు తీసుకోవాలని ప్రదర్శనకారులు డిమాండ్ చేశారు. అక్టోబర్ 2023 నుంచి 73,000 మందికి పైగా పాలస్తీనియన్లను బలిగొన్న ఈ ప్రాంతంపై ముట్టడి, యుద్ధాన్ని ముగించేలా టెల్ అవీవ్‌పై ఒత్తిడి తేవాలని, ఇజ్రాయిల్‌పై ఆయుధాల నిషేధం విధించాలని కోరుతూ లండన్‌లోని ప్రదర్శనకారులు రోడ్డెక్కారు. "మూడేండ్లు గా కొనసాగుతున్న జాతిహననం, బ్రిటన్‌లో ప్రపంచవ్యాప్తంగా న్యాయం, జవాబుదారీతనం కోసం బ్రిటన్ లో జరుగుతున్న ఉద్యమం మరింత బలంగా మారుతోంది," అని యూకేలోని పాలస్తీనా రాయబారి హుసామ్ జోమ్లోట్ ఎక్స్ పోస్ట్‌లో తెలిపారు. లండన్‌లో వేలాది మంది పాలస్తీనా కోసం నిరసన తెలుపుతున్నారని, పాలస్తీనా ప్రజలపై ఇజ్రాయిల్ చేస్తున్న మారణహోమాన్ని అంతం చేయడానికి, ఆ దేశంపై పూర్తిస్థాయి ఆయుధ నిషేధాన్ని విధించడంతో సహా, కొత్త ప్రధాని తక్షణ చర్యలు తీసుకోవాలని ప్రదర్శన కారులు డిమాండ్ చేస్తున్నట్టు పాలస్తీనా సాలిడారిటీ క్యాంపెయిన్ పేర్కొంది. పదవీ విరమణ చేస్తున్న ప్రధాన మంత్రి కీర్ స్టార్మర్ హయాంలో జరిగిన మారణహోమాన్ని ఎదుర్కోవడంలో బర్న్‌హామ్ లేబర్ పార్టీ వ్యవహరించిన తీరుపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. ఇజ్రాయిల్ యుద్ధ నేరాలకు పాల్పడిందనడానికి ఆధారాలు పెరుగుతున్నప్పటికీ, ఆయన ప్రభుత్వం ఆ దేశానికి ఆయుధాలను సరఫరా చేస్తూనే ఉంది.

# కీవ్‌పై రష్యా భారీ ఎటాక్

- ఒకరు మృతి, 16 మందికి గాయాలు
- నగరం అంతటా పేలుళ్లు
- ఒకదాని తర్వాత ఒకటి అన్నట్లుగా క్షిపణుల ప్రయోగం
- గంటల తరబడి దాడులు
- ఐదు జిల్లాల్లో అగ్ని ప్రమాదాలు
- ప్రభుత్వ, ప్రైవేటు భవనాలు ధ్వంసం
- మంటల్లో ఇల్లు... నలుగురిని కాపాడిన సిబ్బంది
- ఉక్రెయిన్ రక్షణ వ్యవస్థలే లక్ష్యంగా దాడి
- రష్యా రక్షణ మంత్రిత్వ శాఖ వెల్లడి
- క్షిపణుల తయారీకి ఉక్రెయిన్‌కు లైసెన్సు
- ట్రంప్ వెల్లడి



కీవ్: ఉక్రెయిన్ రాజధానికి కీవ్‌పై రష్యా క్షిపణులు, డ్రోన్లు వర్షం కురిపించింది. 41 క్షిపణులు, 125 డ్రోన్లతో అతి పెద్ద దాడి చేసింది. దాడిలో ఒకరు మృతి చెందగా, 16 మంది గాయపడ్డారని స్థానిక అధికారులు తెలిపారు. ఈ తాజా దాడి రాత్రి 1:30 గంటల సమయంలో ప్రారంభమై కొన్ని గంటలు కొనసాగింది. నగరం అంతటా పేలుళ్లు మోగాయి. ఉక్రెయిన్ ఎయిర్ ఫోర్స్ ప్రకారం రష్యా రాత్రి సమయంలో 41 క్షిపణులు, 125 డ్రోన్లను ఉక్రెయిన్‌పై ప్రయోగించింది. అధ్యక్షుడు వోలోడిమిర్ జెలెన్స్కీ చెప్పిన ప్రకారం వాటిలో చాలా వాటిని రాజధాని కీవ్‌పై లక్ష్యంగా చేసుకున్నారు. కీవ్‌లోని ఐదు జిల్లాల్లో అగ్ని ప్రమాదాలు సంభవించాయి. నివాస భవనాలు, కార్యాలయాలు, పారిశ్రామిక సైట్లు, హాస్టల్, వాహనాలు దెబ్బతిన్నాయని ఉక్రెయిన్ స్టేట్ ఎమర్జెన్సీ సర్వీస్ తెలిపింది.

**వరుస పెట్టిన క్షిపణుల దాడి**

32 ఏళ్ల విక్టోరియా షెవ్కో తన భర్త, ఏడుగురు పిల్లలతో అపార్ట్‌మెంట్ బ్లాక్ కారిడార్‌లో ఆశ్రయం పొందుతూ బిగ్గరగా పేలుళ్లు విన్నారు. అలారం మొదలైనప్పుడు బాలిస్టిక్ మిస్సైళ్లు ఉన్నాయని చూసి కారిడార్‌కు వెళ్లామని, ఆ తర్వాత ఒక్కొక్క మిస్సైల్ ఒకదాని తర్వాత మరొకటి అన్నట్లుగా పేలుళ్లు సంభవించాయని చెప్పారు. నిరంతర దాడుల ఒత్తిడి మానసికంగా చాలా కష్టంగా ఉందని, ఇది మునుపటి కంటే ఇప్పుడు రోజువారీగా జరుగుతోందని అన్నారు.

**జిల్లాల్లో మంటలు**

స్వియాటోషిన్‌స్కీ జిల్లాలో మంటలు చెలరేగిన ఇంటి నుంచి నలుగురిని సహాయక సిబ్బంది రక్షించారు. షెవ్‌చెంకివ్‌స్కీ జిల్లాలో మూడు అంతస్తుల భవనం మంటల్లో చిక్కుకున్న వారిని రక్షించడానికి ప్రయత్నించారు. ఒకరి మృతదేహం లభ్యమైంది. సోలోమ్యాన్‌స్కీ, డెస్నియన్‌స్కీ, డ్నిప్రో జిల్లాల్లోనూ అగ్ని ప్రమాదాలకు స్పందించారు.

**ఉక్రెయిన్ ఆర్మీ సైట్లు లక్ష్యంగా దాడి**

రష్యా రక్షణ మంత్రిత్వ శాఖ ప్రకారం కీవ్‌పై దాడి ఉక్రెయిన్ సైనిక సంబంధిత సైట్లను లక్ష్యంగా చేసుకుంది. ఫ్లేమింగ్ డ్రోన్లు, నెప్ట్యూన్ గైడెడ్ మిస్సైల్ భాగాలు ఉత్పత్తి చేసే ప్లాంట్లు, డ్యూయల్ యూజ్ వస్తువులు నిల్వ ఉంచే పోస్టల్ టెర్మినల్, డ్రోన్లు, రోబోటిక్ సిస్టమ్స్, ఎలక్ట్రానిక్ వార్‌ఫేర్ సామగ్రి అసెంబ్లీ చేసే ప్రాంతాలు ఇందులో ఉన్నాయి.

**ఉక్రెయిన్‌కు యుఎస్ క్షిపణుల తయారీ లైసెన్సు**

ఉక్రెయిన్‌కు పేట్రియాట్ క్షిపణుల ఉత్పత్తికి లైసెన్సులు ఇవ్వడానికి సిద్ధమని ఉక్రెయిన్‌కు పేట్రియాట్ మిస్సైళ్ల ఉత్పత్తి లైసెన్సులు ఇవ్వడానికి సిద్ధమని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ చెప్పారు. ఇది రష్యా బాలిస్టిక్ మిస్సైల్లను అడ్డుకోవడంలో అత్యంత ప్రభావవంతమైన విధానం కావచ్చు. ఇలాంటి దాడుల నుంచి కీవ్ రక్షణను బలోపేతం చేయవచ్చు. అయితే లైసెన్సు ఎప్పుడు ఇచ్చేది ట్రంప్ స్పష్టం చేయలేదు. తాజా దాడి ఉక్రెయిన్‌కు అమెరికా తయారీ పేట్రియాట్ ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్ల కొరతను మళ్లీ హైలైట్ చేసింది.

# ఘనంగా రాష్ట్ర సేవా సమితి ఉత్సవాలు

**కొత్తపేట :**

ఘనంగా 90 సంవత్సరాల రాష్ట్ర సేవ సమితి ఉత్సవాలు ఆదివారం కొత్తపేటలోని స్పైసి హబ్ లో నిర్వహించారు. స్త్రీ యే రాష్ట్రానికి ఆధారశక్తి అనే సూత్రం ఆధారం గా 90సంవత్సరాల క్రితం ప్రారంభించబడిన సంస్థ రాష్ట్ర సేవిక సమితి. రాష్ట్ర సేవికాసమితి 90సంవత్సరాల ఉత్సవాలను, వం. మౌసీజీ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని "దిక్సూచి " పేరుతో కార్యక్రమం లో కొంపల్లి డిప్యూటీ కమిషనర్ దుబ్బాక లావణ్య ముఖ్య అతిథి గా ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్ వాసవి, గౌరవ అతిథి గా, రాష్ట్ర సేవికాసమితి ప్రాంత కార్యవాహిక శ్రీపాద రాధ ముఖ్య వక్త గా సికింద్రాబాద్ విభాగ్ కార్యవాహిక శ్ విజయలక్ష్మిగారు, భాగ్యనగర్ విభాగ్ కార్యవాహిక శ్రీమతి ప్రసన్నలక్ష్మి పాల్గొన్నారు.

అనంతరం వారు మాట్లాడుతూ 90సంవత్సరాల క్రితం ప్రారంభమైన సంస్థ నిరంతరాయంగా జరగడం సాధారణ విషయం కాదని, అంతే కాక , యే లక్ష్యం తో, దృక్పధం తో ప్రారంభించబడిందో అదే పద్ధతి లో నడవటం అత్యంత గొప్ప విషయమని అన్నారు.వ్యక్తి నిర్మాణం తోనే రాష్ట్ర నిర్మాణం సాధ్యమని తెలిపారు.దృఢ సంకల్పం, సేవభావం ఉంటే ఏ పనైనా సాధ్యమని వం. మౌసీజీ జీవితం ద్వారా మనకు అర్థమవుతుందని వాసవి తమ సందేశాన్ని అందించారు.

ఒకవ్యక్తి 90సంవత్సరాలు పూర్తి చేసుకున్నాడంటే సంపూర్ణ జీవితం గా భావిస్తామని, అదే ఒక సంస్థ 90సంవత్సరాలు పూర్తి అంటే ఎన్నో ఆటుపోట్లు, ఎన్నో విజయాలు ఎన్నో మైలురాళ్ళు. అందుకే ఈనాడు సమాజానికి సరైన దారి చూపించే సంస్థ రాష్ట్ర సేవికా సమితి అని, అందుకే ఈ కార్యక్రమానికి



దిక్సూచి గా నామకరణం చేశామని చెప్పారు.సేవికాసమితి 90 సంవత్సరాల ప్రస్థానం వం. మౌసీజీ ద్వారానే సాధ్యమయిందని వారి మాటే మంత్రం గా మారిందని చెప్తూ వారి చిన్ననాటి విషయాలను సభతో పంచుకున్నారు. అనేక సమస్యలు, సంక్షోభ సమయంలో వారి ఆలోచన, చెప్పిన మాట సమస్యలు సులువుగా తీర్చబడిన సందర్భాలు తెలిపారు.

అలాగే అత్యవసర పరిస్థితి విధించబడిన సందర్భంలో శ్రీరామ ఆజ్ఞ గా వారు రామకథ చెప్పారు. అనేక విషయాలను వివరం గా విశ్లేషించి సమకాలీన సమాజానికి శ్రీరామాయణం ఎలా దారి చూపుతుందో తెలిపేవారు. అంతే కాదు వివిధ క్షేత్రాలలో స్త్రీ పాత్ర ఏమిటో,ఎలా ఉండాలో స్పష్టంగా చెప్పేవారు.

సేవికాసమితి ప్రారంభించిన తరువాత అష్టభుజాదేవి రూపకల్పన చేశారు వం. మౌసీజీ. స్త్రీ యొక్క స్వస్వరూప దర్శనమే అష్టభుజా.అందుకే" సమాజం అనే రథానికి పురుషుడు రథి అయితే స్త్రీ సారథి " అని చెప్పేవారు వం మౌసీజీ .స్త్రీ కి స్వ సంరక్షణ క్షమత ముఖ్యమని, దానిని నేర్పించేదే రాష్ట్ర సేవికాసమితి అని చెప్పారు.

ఈవిధం గా కొనసాగిన వారి ప్రస్థానం భారత విభజన సమయంలో సింధు ప్రాంతానికి వెళ్ళి అక్కడి సేవికలకు సందేశం ఇచ్చిన వం. మౌసీజీ సుశీల, సుధీర, సమర్థ గా జీవించడమే స్త్రీ యొక్క ఉన్నతి అని చెప్పారని, వారు, సేవికాసమితి కార్యము అభేదమని చెప్తూ ముగించారు. వేదిక మీద సికింద్రాబాద్ విభాగ్ కార్యవాహిక విజయ లక్ష్మి భాగ్యనగర్ విభాగ్ కార్యవాహిక ప్రసన్నలక్ష్మి ఉన్నారు. కార్యక్రమ ప్రారంభం లో సేవికలచే ప్రదర్శింపబడిన వం. మౌసీజీ నృత్య రూపకం ప్రేక్షకులను ఆకట్టుకున్నది.

కార్యక్రమం లో రాష్ట్ర సేవికాసమితి కార్యకర్తలు పాల్గొన్నారు.600మందితో కార్యక్రమం నిర్వహించారు.

# జమ్ముకశ్మీర్‌లో వరదల బీభత్సం..

### 11 మంది మృతి.. పలువురి గల్లంతు



**న్యూఢిల్లీ, -- జూలై 19 జర్నలిస్ట్ డైరీ**
జమ్మూకశ్మీర్ లో భారీ వర్షాలు, వరదలు బీభత్సం సృష్టించాయి. ఎడతెగని వర్షాలవల్ల రాజౌరీ, పూంచ్ జిల్లాల్లో మెరుపు వరదలు సంభవించాయి. రాజౌరీలో నదులు పొంగిపొర్లడంతో పలు ప్రాంతాలను వరద ముంచెత్తింది. కొత్త బస్టాండ్ పూర్తిగా నీట మునిగింది. ఈ వరదలవల్ల 11 మంది మృతిచెందారు. పలువురు గల్లంతయ్యారు. మరికొందరు తీవ్రంగా గాయపడ్డారు. శనివారం సాయంత్రం నుంచి కురిసిన భారీ వర్షాలకు ఆదివారం వరదలు పోటెత్తాయి. ఈ ఘటనలో నలుగురు మృతిచెందగా మరో ఐదుగురు గల్లంతయ్యారు. మృతుల్లో భారీ వర్షాల కారణంగా పూంచ్ జిల్లాలో ఇల్లు కూలి ముగ్గురు మరణించగా రాజౌరిలో కొండచరియలు విరిగిపడటం, ఆకస్మిక వరదలు, భారీ వర్షాలతో ఒకరు ప్రాణాలు కోల్పోయారు. మరోవైపు గల్లంతైన ఐదుగురి కోసం సహాయక బృందాలు గాలింపు చర్యలు కొనసాగిస్తున్నాయి. వందలాది మందిని అధికారులు సురక్షిత ప్రాంతాలకు తరలించారు. రాజౌరి జిల్లాలోని దర్హాలి, ఖండ్లీ, సుక్తోహ్, జమోలా నదులతో సహా అన్ని ప్రధాన నదులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. వాటిలో చాలా వరకు ప్రమాదకర స్థాయికి చేరి అనేక లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురయ్యాయి. ముఖ్యంగా రాజౌరి పట్టణాన్ని వరదనీరు ముంచెత్తింది. దర్హాలి నదికి వరద పోటెత్తగా బేలా కాలనీ సమీపంలోని రక్షణ గోడ కూలిపోయింది. దాంతో కొత్త బస్టాండ్ ఆవరణలోకి వరద నీరు దూసుకొచ్చి డజన్ల కొద్దీ వాహనాలు కొట్టుకుపోయాయి. అబ్దుల్లా వంతెన సమీపంలోని మురికివాడ కూడా తీవ్రంగా దెబ్బతింది. ఆ ప్రాంతంలోకి వరదనీరు ప్రవేశించడంతో 50 కిపైగా కుటుంబాలను అధికారులు ఖాళీ చేయించారు. తారిఖ్ వంతెన సమీప ప్రాంతాన్నీ వరద నీరు ముంచెత్తింది. దాంతో పోలీసులు, అత్యవసర సిబ్బంది స్థానికులను నదీ తీర ప్రాంతానికి దూరంగా తరలించారు. అలాగే నదీ తీరం, లోతట్టు ప్రాంతాల ప్రజలు వెంటనే ఇళ్లను ఖాళీ చేయాలని అధికారులు సూచించారు. కాగా జమ్మూకశ్మీర్ వ్యాప్తంగా జూలై 23 వరకు మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో శనివారం సాయంత్రం నుంచి ఎడతెరిపి లేకుండా వర్షాలు కురిశాయి. గత 24 గంటల్లో రియాసిలో అత్యధికంగా 106 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. రాజౌరిలో 103 మిల్లీమీటర్లు, ఉధంపూర్‌లో 101.6 మిల్లీమీటర్లు, కత్రాలో 85 మిల్లీమీటర్లు, పూంచ్‌లో 77 మిల్లీమీటర్లు, బటోటేలో 57.5 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదైంది.


## రామజన్మభూమి విరాళాలపై
# స్వతంత్ర విచారణ జరిపించండి..

### మోదీకి ఖర్గే, రాహుల్ లేఖ



**న్యూఢిల్లీ, - జూలై 19 జర్నలిస్ట్ డైరీ**
అయోధ్యలోని రామ మందిరంలో విరాళాలకు సంబంధించి అక్రమాలు, అవకతవకలు జరిగిన సంగతి తెలిసిందే. ఈ అంశంపై తాజాగా కాంగ్రెస్ పార్టీ జాతీయాధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ స్పందించారు. ఈ అంశంపై విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తూ ప్రధాని మోదీకి ఇద్దరూ కలిసి బహిరంగ లేఖ రాశారు. ఆదివారం రాసిన ఈ లేఖలో ఖర్గే, రాహుల్ కీలక అంశాల్ని ప్రస్తావించారు. రామాలయానికి సంబంధించి శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్‌కు సంబంధించిన ఆర్థిక వ్యవహారాలపై స్వతంత్ర దర్యాప్తు జరిపించాలని లేఖలో డిమాండ్ చేశారు. ఈ ట్రస్టుకు భక్తులు తమ కష్టార్జితాన్ని విరాళాలుగా అందిస్తే, ఈ ట్రస్టు మాత్రం వాటిని ఎత్తుకెళ్లి వారికి వెన్నుపోటు పొడిచిందని లేఖలో పేర్కొన్నారు. లక్షల మంది భక్తులు సమర్పించిన కానుకల మాయంపై మోదీకి అవగాహన ఉందని లేఖలో వివరించారు. ఎందరో తమ భక్తితో, విశ్వాసంతో, నమ్మకంతో కానుకలు సమర్పిస్తే వాటిని ఎత్తుకెళ్లారని విమర్శించారు. సుప్రీంకోర్టు సూచనలకు అనుగుణంగా ట్రస్టును ఏర్పాటు చేస్తామని పార్లమెంట్‌లో ప్రకటించి, తర్వాత నచ్చినవారిని సభ్యులుగా నియమించుకున్నారని మోదీకి గుర్తు చేశారు. ఈ ట్రస్టులో వీహెచ్‌పీ, ఆర్ఎస్ఎస్ సభ్యులే ఉన్నారని, జనరల్ సెక్రెటరీ మోదీకి అత్యంత సన్నిహితుడే అని లేఖలో పేర్కొన్నారు. ఇలాంటి నేరం జరిగినప్పటికీ మోదీ మౌనంగా ఉండటం అంగీకరించలేమని అన్నారు. ఈ విషయంలో జవాబుదారీగా వ్యవహరించాలని, దీనిపై స్వతంత్ర, సమగ్ర విచారణ జరిపించాలని లేఖలో డిమాండ్ చేశారు. ట్రస్టుకు సంబంధించిన ఆర్థిక వ్యవహారాలను ప్రజలకు బయటపెట్టాలని కోరారు. ఈ అక్రమాలకు బాధ్యులైన అందరిపై చర్యలు తీసుకోవాలని, నిందితులు ఎలాంటిస్థాయిలో ఉన్నా వదిలిపెట్టవద్దని కోరారు. రామజన్మభూమి ఆలయంలోని అవకతవకలపై సీఎం యోగి ఆదిత్యనాథ్ విచారణ జరిపిస్తున్నారు. ఇందుకోసం ఒక సిట్ ఏర్పాటు చేశారు. ఈ సిట్ ప్రాథమిక నివేదిక సమర్పించింది. ఇంకా విచారణ కొనసాగుతోంది. పలువురిని అరెస్టు కూడా చేశారు.

## ఆ 'రెండు' షరతులకు అంగీకరిస్తే
# నా భర్త దీక్ష విరమిస్తారు..!



**న్యూఢిల్లీ, -- జూలై 19 జర్నలిస్ట్ డైరీ**
'ఛలో పార్లమెంట్'కు ఢిల్లీ పోలీసులు అనుమతి నిరాకరించడంతో సోనమ్ వాంగ్‌చుక్ భార్య అన్మోగ్ గీతాంజలి కీలక వ్యాఖ్యలు చేశారు. పోలీసుల ఆంక్షల నేపథ్యంలో రెండు షరతులకు అంగీకరిస్తే తన భర్త సోనమ్ దీక్షను విరమించేందుకు సిద్ధంగా ఉన్నారని ఆదివారం ఆమె తెలిపారు. సోనమ్‌ను సఫ్దర్‌జంగ్ ఆస్పత్రి నుంచి ప్రైవేట్ దవాఖానకు తరలించేందుకు హైకోర్టు కూడా అనుమతి ఇవ్వకపోవడంతో.. భర్తతో మాట్లాడిన గీతాంజలి రెండు షరతులు మీడియా ముందుంచారు. మూడు వారాలకు పైగా అమరణ దీక్ష చేసి.. ప్రస్తుతం ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యుల పర్యవేక్షణలో ఉన్నారు సోనమ్ వాంగ్‌చుక్. నీట్ ప్రశ్నాపత్రం లీకేజీలో జవాబుదారీతనం కోరుతూ దీక్షకు పూనుకున్న ఆయన విరమణకు ప్రభుత్వానికి రెండు షరతులు విధించారు. భార్య అన్మోగ్ గీతాంజలి ద్వారా తన కండీషన్స్‌ను తెలియజెప్పారు సోనమ్. ఇంతకూ ఆ రెండు షరతులు ఏంటంటే.. 'రాజకీయ నాయకులు ఆస్పత్రికి వచ్చి ఆయనను కలవాలి. రెండోది.. సోమవారం నుంచి ప్రారంభం కానున్న పార్లమెంట్ సమావేశాల్లో విద్యా వ్యవస్థలో జవాబుదారీతనం గురించి చర్చించాలి'. ఈ రెండు డిమాండ్స్‌కు కేంద్ర ప్రభుత్వం అంగీకరిస్తే సోనమ్ తన దీక్షను విరమిస్తారని గీతాంజలి పేర్కొన్నారు.

**21 రోజుల దీక్ష**
నీట్ ఎగ్జామ్ లీకేజీకి బాధ్యతగా కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా కోరుతున్న కాక్రోచ్ జనతా పార్టీకి మద్దతుగా సోనమ్ వాంగ్‌చుక్ జూన్ 28న అమరణ నిరాహార దీక్షకు పూనుకున్నారు. ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద 21 రోజుల దీక్ష తర్వాత ఆయన ఆరోగ్యం క్షీణించడంతో ఆస్పత్రికి తరలించాలని హైకోర్టు ఆదేశించింది. దాంతో.. పోలీసులు బలవంతంగా సోనమ్‌ను సఫ్దర్‌జంగ్ ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స అందిస్తున్నారు. అయితే.. తన భర్తను పోలీసులు బలవంతంగా తీసుకెళ్లారని ఆయన ఇప్పటికీ దీక్షలోనే ఉన్నారని గీతాంజలి మీడియాకు తెలిపారు. సీజేపీ పిలుపుమేరకు జూలై20న ఛలో పార్లమెంట్‌లో పాల్గొంటామని, ఒకవేళ సోనమ్ రాని పక్షంలే తాను నాయకత్వం వహిస్తానని కూడా ఆమె స్పష్టం చేసిన విషయం తెలిసిందే.

## కేన్-బెత్వా నిరసనలు భగ్నం

### ఆందోళనకారులను స్వగ్రామాలకు పంపిన పోలీసులు



**ఛతర్పూర్ - - జూలై 19 జర్నలిస్ట్ డైరీ**
మధ్యప్రదేశ్ ఛతర్పూర్ జిల్లాలోని కేన్-బెత్వా నదుల అనుసంధాన ప్రాజెక్టులోని అక్రమాలను నిరసిస్తూ గత 15 రోజులుగా బరానా నదికి సమీపంలోని కుపీ గ్రామంలో పలు గ్రామాల ప్రజలు జరుపుతున్న నిరసనకు పోలీసులు తెరదించారు. వందలాది మంది ఆందోళనకారులను నిరసన ప్రాంతం నుంచి ఖాళీ చేయించిన పోలీసులు వారిని తమ గ్రామాలకు పంపించి వేశారు. గిరిజన మహిళ అమిత్ భట్నాగర్ జూలై 3 నుంచి ఆందోళన చేయడమే కాక, గత 11 రోజులుగా ఆమరణ నిరశన చేస్తున్నారు. గత 15 రోజులుగా వివిధ మార్గాల్లో వారు తమ నిరసనను వ్యక్తం చేశారు. కేన్-బెత్వా నదుల అనుసంధాన ప్రాజెక్టు, ఇతర అభివృద్ధి కార్యక్రమాలకు వ్యతిరేకంగా ఈ నిరసన జరిగింది.


## ఓపెన్ ఏఐ సీటీవోగా
# ఉదయ్ రుద్దరాజు



**కాలిఫోర్నియా,- - జూలై 19 జర్నలిస్ట్ డైరీ**
భారత సంతతికి చెందిన ప్రముఖ టెక్ నిపుణుడు ఉదయ్ రుద్దరాజు ఏఐ(కృత్రిమమేధ) రంగంలో గ్లోబల్ లీడర్‌గా ఉన్న 'ఓపెన్ ఏఐ'లో కీలక పదవికి ఎంపికయ్యారు. కంపెనీలో ఒక సంవత్సరంపాటు 'హెడ్ ఆఫ్ కంప్యూట్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్'గా బాధ్యతలు నిర్వహిస్తున్న ఆయనను 'చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్ (సీటీవో) ఆఫ్ కంప్యూట్'గా ప్రమోట్ చేసినట్టు 'ఓపెన్ ఏఐ' ప్రకటించింది. 'సీటీవోగా బాధ్యతలు చేపట్టడం సంతోషంగా ఉందని ఉదయ్ తెలిపారు.

## 10లో 9మందికి చెడు కొలెస్ట్రాల్

### ఇదొక కనిపించని మహమ్మారి ఐసీఎంఆర్ అధ్యయనం



**న్యూఢిల్లీ,- - జూలై 19 జర్నలిస్ట్ డైరీ**
భారత్‌లో చెడు కొలెస్ట్రాల్ మహమ్మారిగా విస్తరిస్తున్నదని 'ఐసీఎంఆర్' తాజా అధ్యయనం పేర్కొన్నది. ప్రతి 10 మంది పెద్దవాళ్లలో 9మందికి ఈ చెడు కొలెస్ట్రాల్ అసాధారణ స్థాయిల్లో ఉందని పేర్కొన్నది. దీనివల్ల అనేకమందికి చిన్న వయస్సుల్లోనే(30-39) గుండె జబ్బులు, మెదడులో స్ట్రోక్ తలెత్తడానికి కారణమవుతున్నదని అంచనావేసింది. దేశవ్యాప్తంగా 23,665 మంది పెద్దవాళ్ల 'లిపిడ్ ప్రొఫైల్స్' (రక్తంలోని కొవ్వులపై) విశ్లేషించగా కీలక విషయాలు వెలుగుచూశాయి. ఉదాహరణకు రక్తంలో మంచి కొలెస్ట్రాల్ (హెచ్‌డీఎల్) ఎక్కువగా ఉండి..ఎల్‌డీఎల్ (ట్రై గ్లిజరైడ్స్-చెడు కొవ్వు) తక్కువగా ఉండటం ఆరోగ్యకర లక్షణం. కానీ 66.8శాతం మంది పెద్దవాళ్లలో హెచ్‌డీఎల్ తక్కువగా ఉంది. 49.4 శాతం మందిలో ఎల్‌డీఎల్ అధిక స్థాయిలో ఉందని తేలింది.


## డీలిమిటేషన్ బిల్లుకు డీఎంకే మద్దతు!



**న్యూఢిల్లీ, - జూలై 19 జర్నలిస్ట్ డైరీ**
ఎన్డీయే ప్రభుత్వ ప్రతిపాదిత నియోజకవర్గ పునర్విభజన బిల్లుకు డీఎంకే మద్దతు తెలిపే అవకాశం ఉంది. ఆదివారం అఖిలపక్ష సమావేశం అనంతరం రివెల్యూషనరీ సోషలిస్ట్ పార్టీ ఎంపీ ప్రేమ్‌చంద్రన్ తెలిపిన వివరాల ప్రకారం డీఎంకే ఈ బిల్లు మద్దతుకు అంగీకరించింది. ఈ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెడుతున్నట్టు ప్రభుత్వం ఇంకా ప్రకటించకపోయినప్పటికీ బిల్లు ఆమోదానికి అవసరమైన ఎంపీల మద్దతు సేకరించగలమని అధికార పక్షం ఆశావహ దృక్పథంతో ఉన్నది. మొదట్లో ఈ బిల్లు వల్ల పార్లమెంట్‌లో దక్షిణాదికి ప్రాతినిధ్యం తగ్గుతుందని వ్యతిరేకించిన డీఎంకే తాజాగా తన వైఖరి మార్చుకున్నది. ఇండియా కూటమి నుంచి వైదొలగిన తర్వాత డీఎంకేకు కాంగ్రెస్‌తో ఉన్న సంబంధాలు క్షీణించిన తరుణంలో ఈ మార్పు చోటుచేసుకుంది. తమిళనాడుపై దాని ప్రభావం ఆధారంగానే డీలిమిటేషన్ బిల్లును అంచనా వేస్తామని డీఎంకే తెలిపింది.


## 50 సార్లు విఫలమయ్యా .. చనిపోతున్నా

### ప్రభుత్వ ఉద్యోగం రాలేదని గోల్డ్ మెడలిస్ట్ ఆత్మహత్య



**కాన్పూర్:న్యూఢిల్లీ, - జూలై 19 జర్నలిస్ట్ డైరీ**
50 సార్లు ప్రయత్నించినా ప్రభుత్వ ఉద్యోగం రాలేదని 23 ఏండ్ల బీటెక్ బంగారు పతక గ్రహీత ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్‌లో శుక్రవారం ఈ ఘటన జరిగింది. హృదయ విదారకమైన ఆత్మహత్య లేఖలో 'సారీ నాన్న, ప్రభుత్వం ఉద్యోగం కోసం 50 సార్లు ప్రయత్నించాను. కానీ నేను సఫలం కాలేకపోయాను. దయచేసి నన్ను క్షమించు' అని పలుమార్లు అతడు తన తండ్రిని క్షమాపణ కోరాడు. ఇంటి పని మనిషి ఇల్లు లోపలి వైపు తాళం వేసి ఉండటాన్ని గమనించి విషయాన్ని పోలీసులకు, మృతుడు ఆనంద్ కుమార్ కుటుంబానికి తెలిపింది. పోలీసులు తలుపులు పగులగొట్టి చూడగా ఆనంద్ ఫ్యానుకు వేలాడుతూ కనిపించాడు. అయిదు రోజుల క్రితం ఆనంద్ నాన్న, తాత అతడి అన్నకు పెండ్లి సంబంధం చూసేందుకు బీహార్ వెళ్లారు. 2024లో బీటెక్ పూర్తి చేసిన ఆనంద్ రాష్ట్రంలో మూడో ర్యాంక్ సాధించడంతో గవర్నర్ నుంచి బంగారు పతకం అందుకున్నాడు.

## జమ్ము-కశ్మీర్‌కు రాష్ట్రహోదా కోసం నేడు ఢిల్లీలో ఎన్‌సీ ధర్నా



**న్యూఢిల్లీ, -- జూలై 19 జర్నలిస్ట్ డైరీ**
జమ్ము-కశ్మీర్ రాష్ట్ర హోదా కోసం 20న (నేడు) ఢిల్లీలోని జంతర్‌మంతర్‌లో నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్‌సీ)నిరసన చేపట్టనుంది. అయితే జమ్ములో ఆకస్మిక వరదల కారణంగా ఇప్పటి వరకు 12 మంది చనిపోవడంతో.. పరిస్థితిని వ్యక్తిగతంగా సమీక్షించేందుకు సీఎం ఒమర్ అబ్దుల్లా జమ్ముకు ఆదివారం తిరుగుప్రయాణం అయ్యారు. దీంతో నేషనల్ కాన్ఫరెన్స్ అధినేత, ఒమర్ తండ్రి ఫరూక్ అబ్దుల్లా ఈ నిరసనలకు నాయకత్వం వహించబోతున్నారు. 'వాతావరణ శాఖ జమ్ముకు భారీ వర్షాలు, వరదల ముప్పు ఉందని హెచ్చరించినందున.. నేను సమీక్షించేందుకు జమ్ము వెళ్తున్నా. నిరసనలు ఫరూక్ అబ్దుల్లా నాయకత్వంలో కొనసాగుతాయి' అంటూ ఒమర్ ఎక్స్‌లో తెలిపారు.

జర్నలిస్ట్ డైరీ
తెలుగు దినపత్రిక

# కాంగ్రెస్‌పై కస్సుమన్న కమలం

**-గురిగింజ సామెత మీకే వర్తిస్తుంది మా జోలికొస్తే సహించేది లేదు**
**-బీజేపీ దౌల్తాబాద్ మండల అధ్యక్షుడు అశోక్**



**జర్నలిస్ట్ డైరీ కొడంగల్ జులై 19:-** బీజేపీపై కాంగ్రెస్ నాయకులు చేసిన అనుచిత వ్యాఖ్యలపై దౌలతాబాద్ బీజేపీ మండల అధ్యక్షుడు అశోక్ తీవ్రంగా మండిపడ్డారు. కొడంగల్ నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు రెడ్డి శ్రీనివాస్ ఇటీవల బీజేపీని విమర్శిస్తూ చేసిన వ్యాఖ్యలకు బీజేపీ కొడంగల్ నియోజకవర్గం దౌల్తాబాద్ మండలం అధ్యక్షుడు అశోక్ ఘాటుగా సమాధానమిస్తూ రాబోయే ఎన్నికలలో మీ చేతగాని ప్రభుత్వం పైనే బీజేపీ యుద్ధం ప్రకటిస్తుందని వచ్చే ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ ఖచ్చితంగా అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. అలాగే బీజేపీ నాయకుడు కాటిపల్లి వెంకటరమణారెడ్డి కోడంగల్ వస్తుంటే కాంగ్రెస్ పార్టీకి భయం ఎందుకు అని ప్రశ్నించిన ఆయన భారత పౌరుడిగా ఉన్న ప్రతి ఒక్కరికీ దేశంలో ఎక్కడైనా ఏ అసెంబ్లీ లేదా పార్లమెంట్ నియోజకవర్గం నుండైనా పోటీ చేసే హక్కు భారత రాజ్యాంగం కల్పించిందని గుర్తు చేశారు. తెలంగాణలోని 119 నియోజకవర్గాల్లో కాటిపల్లి వెంకటరమణారెడ్డి ఎక్కడైనా పోటీ చేయవచ్చని ఈ విషయాన్ని కాంగ్రెస్ విస్మరించిందని ఆరోపించారు. మరోవైపు విద్యార్థులను యువతను కాంగ్రెస్ విమర్శించడాన్ని తప్పుపడుతూ రేపటి తరం ఓటర్లయిన వారే ఈ చేతగాని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గద్దె దించి బీజేపీకి పట్టం కట్టడం ఖాయమన్నారు. బీజేపీ కార్యకర్తలను 'సన్యాసులు' అని సంబోధించడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ బీజేపీ కార్యకర్తలు నిఖార్సైన వారని పూటకో జెండా మార్చే అలవాటు తమకు లేదని కాంగ్రెస్ నాయకులే ఎన్నో పార్టీలు మారి వచ్చారని "గురిగింజ సామెత" చందంగా ఎద్దేవా చేశారు. చివరగా నోటికి వచ్చినట్లు రెచ్చగొట్టే విధంగా మాట్లాడితే తాము కూడా అదే స్థాయిలో సమాధానం చెప్పడానికి సిద్ధంగా ఉన్నామని ఇలాంటి వ్యాఖ్యలు పునరావృతమైతే బీజేపీ కార్యకర్తలు దేనికైనా సిద్ధంగా ఉంటారని కాంగ్రెస్ నాయకులను అశోక్ హెచ్చరించారు.

# అమరవీరుల ఆశయాలు నెరవేరినప్పుడే నిజమైన నివాళి

**-ఎక్సైజ్, పర్యాటకం, సాంస్కృతిక మరియు పురావస్తు శాఖల మంత్రి మంత్రి జూపల్లి**
**-షాద్ నగర్ నియోజకవర్గంలో నలుగురు అమరవీరుల కుటుంబాలకు రూ 4 లక్షల సాయం**
**-అమరుల స్తూపమే సాక్ష్యం - ఎమ్మెల్సీ కోదండరాం**
**-ఉద్యమకారులకు ఇళ్ల స్థలాల కోసం 20 ఎకరాలు కేటాయిస్తాం**
**-షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**
**-మరుగున పడిన అసలైన ఉద్యమకారులకు గుర్తింపు ఇవ్వాలి: వెన్నెల గద్దర్**
**-"నా బిడ్డ త్యాగం వృథా కాలేదు".. భావోద్వేగానికి గురైన శ్రీకాంతాచారి తల్లి శంకరమ్మ**
**-ఉద్యమకారులకు న్యాయం చేసే ప్రభుత్వం ఇదే - మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ రెడ్డి**
**-ఆత్మహత్యలు కాదు.. పోరాటమే పరిష్కారం బిజెపి నేత నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి**
**-అమరవీరుల స్తూపం ఆశయాలకు మార్గదర్శకం - వంగూరి గంగిరెడ్డి**
**-శంకరన్నకే ఈ గౌరవం దక్కుతుంది - ఉద్యమకారుడు పినపాక ప్రభాకర్**



**రంగారెడ్డి జిల్లా బ్యూరో, జూలై 19 (జర్నలిస్ట్ డైరీ) :** తెలంగాణ కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరుల ఆశయాలు పూర్తిగా సాకారమైనప్పుడే వారికి నిజమైన నివాళి అర్పించినవారమవుతామని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక మరియు పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు. రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్‌లో తెలంగాణ అమరవీరుల స్తూపం ఆవిష్కరణ సందర్భంగా నిర్వహించిన సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.
తెలంగాణ కోసం అసువులు బాసిన అమరవీరులు పవిత్రమైన త్యాగం చేశారని, వారు సాధించాలనుకున్న లక్ష్యాలను పాలకులుగా మనం అమలు చేసినప్పుడే వారి త్యాగాలకు అర్థం ఉంటుందని మంత్రి అన్నారు. శ్రీకాంతాచారి ఆత్మాహుతి తర్వాత తెలంగాణ ఉద్యమం మరింత ఉధృతమై జాతీయ స్థాయికి చేరుకుందని గుర్తు చేశారు. ప్రపంచం మెచ్చిన తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని పాలనలోనూ ప్రతిబింబించేలా ముందుకు సాగాలని సూచించారు. తెలంగాణ కోసం పెట్టుకున్న ఆశయాలు నెరవేరే వరకు ప్రతి ఒక్కరూ తమ కర్తవ్యాన్ని మరువకూడదని పిలుపునిచ్చారు. అదేవిధంగా షాద్ నగర్ లో తెలంగాణ ఉద్యమానికి బలైన నాలుగు కుటుంబాలకు లక్ష రూపాయల చొప్పున 4 లక్షల రూపాయలు ప్రభుత్వం ద్వారా అందజేస్తామని మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. ఉద్యమకారులకు మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యే శంకర్ లు ఘనంగా సన్మానించారు.

**అమరుల స్తూపమే సాక్ష్యం - ఎమ్మెల్సీ కోదండరాం**

తెలంగాణ చరిత్రను కొందరు వక్రీకరిస్తున్నారని చరిత్ర పై నిందారోపణలు చేస్తున్నారని ఇది పూర్తిగా వాస్తవ విరుద్ధమని ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. సభలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అనైతికంగా జరిగిందంటూ కొందరు అంటున్నారని అలాంటివారు అమరవీరుల స్థూపాన్ని చూడాలన్నారు. స్థూపమే 1200 మంది బలిదానాలకు సాక్ష్యం అన్నారు. తెలంగాణ పోరాటం పూర్తిగా ఆత్మగౌరవ పోరాటమని ఆయన అన్నారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ స్థూపాన్ని ఏర్పాటు చేసి ఉద్యమకారులను ఎంతో గుర్తించాలని త్వరలోనే ఉద్యమకారులకు కూడా ప్రభుత్వ నుండి మంచి గుర్తింపు ఉంటుందని అన్నారు.

**ఉద్యమకారులకు 20 ఎకరాల ఇళ్ల స్థలాలు: ఎమ్మెల్యే శంకర్**

షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ, గత పాలకులు ఉద్యమకారులను నిర్లక్ష్యం చేశారని విమర్శించారు. గద్దర్ వంటి మహనీయులను అవమానించారని, అమరవీరుడు శ్రీకాంతాచారి తల్లి శంకరమ్మను కూడా పట్టించుకోలేదని అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి పది సంవత్సరాలు గడిచినా ఉద్యమకారుల సంక్షేమంపై సరైన దృష్టి పెట్టలేదని పేర్కొన్నారు.
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉద్యమకారులను గౌరవిస్తూ ఇచ్చిన హామీలను అమలు చేసే దిశగా ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. షాద్‌నగర్ నియోజకవర్గంలోని నిజమైన ఉద్యమకారులకు ఇళ్ల స్థలాలు అందించేందుకు 20 ఎకరాల భూమిని త్వరలో కేటాయించనున్నట్లు సభ వేదికగా ప్రకటించారు. ఉద్యమకారులు ఐక్యతతో ముందుకు సాగి తమ హక్కులు సాధించుకోవాలని సూచించారు.

**మరుగున పడిన ఉద్యమకారులకు గుర్తింపు ఇవ్వాలి: వెన్నెల గద్దర్**

రాష్ట్ర సాంస్కృతిక శాఖ చైర్‌పర్సన్ వెన్నెల గద్దర్ మాట్లాడుతూ, తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన అనేక మంది ఉద్యమకారులు గుర్తింపు లేక మరుగున పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. అమరవీరుల కుటుంబాలకు పూర్తి న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. తెలంగాణ చరిత్రను మనమే లిఖించుకోవాలని, తెలంగాణ ఉద్యమంపై సమగ్ర గ్రంథం వెలువడాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. అడవుల నుంచి సమాజంలోకి వస్తున్న కుటుంబాలకు సామాజిక భద్రత కల్పించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని పేర్కొన్నారు. గద్దర్ చూపిన ఆశయాల మార్గంలో తాను కూడా పనిచేస్తానని తెలిపారు.

**"నా బిడ్డ త్యాగం వృథా కాలేదు"- శంకరమ్మ భావోద్వేగం**

మహిళా కమిషన్ సభ్యురాలు, అమరవీరుడు శ్రీకాంతాచారి తల్లి శంకరమ్మ సభలో భావోద్వేగంగా మాట్లాడారు. తన కుమారుడు ప్రాణత్యాగం చేస్తూ "జై తెలంగాణ" నినాదం చేశాడని గుర్తు చేసుకుంటూ కన్నీటి పర్యంతమయ్యారు. అమరవీరుల కుటుంబాలకు అండగా నిలిచే నాయకులు ప్రతి ఊర్లో ఉండాలని ఆమె కోరారు. తన కుమారుడి త్యాగం వృథా కాలేదని, తెలంగాణ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయాడని అన్నారు.

**ఉద్యమకారులకు గుర్తింపు రావాలి: ప్రతాప్ రెడ్డి**

షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ, సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఉద్యమకారులకు తగిన గుర్తింపు లభిస్తోందన్నారు. తెలంగాణ కోసం తాను 17 సార్లు ఢిల్లీకి వెళ్లి పోరాడానని గుర్తు చేశారు. అమరవీరులు కలలుగన్న నీళ్లు, నిధులు, నియామకాలపై ప్రభుత్వం దృష్టి సారించిందని తెలిపారు.

**ఆత్మహత్యలు కాదు.. పోరాటమే మార్గం: శ్రీవర్ధన్ రెడ్డి**

బీజేపీ రాష్ట్ర నాయకుడు నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ, పాలమూరు బిడ్డల త్యాగాలు వెలకట్టలేనివని అన్నారు. తెలంగాణ కోసం పోరాడిన మహనీయుల సేవలను గుర్తు చేస్తూ, సమస్యల పరిష్కారానికి పోరాటమే మార్గమని, ఆత్మహత్యలు ఎప్పటికీ శరణ్యం కాదని సూచించారు.

**స్తూపం కాదు.. ఆశయాల దీపం: వంగూరి గంగిరెడ్డి**

కవి, రచయిత వంగూరి గంగిరెడ్డి మాట్లాడుతూ, షాద్‌నగర్‌లో నిర్మించిన అమరవీరుల స్తూపం కేవలం నిర్మాణం కాదని, అది తెలంగాణ ఆశయాలను తరతరాలకు చాటే ఒక దీపమని అన్నారు. ఉద్యమకారులను గౌరవిస్తూ ఎమ్మెల్యే శంకర్ తీసుకున్న నిర్ణయం అభినందనీయమని కొనియాడారు.

**శంకరన్నకే ఈ గౌరవం దక్కుతుంది: ఉద్యమకారుడు పినపాక ప్రభాకర్**

ఉద్యమకారుడు పినపాక ప్రభాకర్ మాట్లాడుతూ అమరవీరుల స్తూపం నిర్మించిన ఘనత ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కే దక్కుతుందని అన్నారు. గద్దర్ తదితర మహనీయుల విగ్రహాలను ఏర్పాటు చేయడం కూడా ప్రశంసనీయమని అన్నారు. ఉద్యమ కారులు శంకర్ కు రుణపడి ఉంటారని కొనియాడారు. సభ ప్రారంభంలో సంతాప తీర్మానం ప్రవేశ పెట్టి అమరవీరులకు రెండు నిమిషాల మౌనం పాటించి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని వివిధ మండలాల నుంచి పెద్ద సంఖ్యలో ఉద్యమకారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

## వైభవంగా సాగుతున్న శ్రీ మహావారాహి ఆశాడ గుప్త నవరాత్రి ఉత్సవాలు....





**నాగారం, జూలై 19:-(జర్నలిస్ట్ డైరీ)** శ్రీ మహావారాహి ఆశాడ గుప్త నవరాత్రి ఉత్సవాల్లో వైభవంగా సాగుతున్నాయి.
ఉత్సవాలలో భాగంగా ఆదివారం జరిగిన హోమాది కార్యక్రమాలలో నాగారం కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు ముప్పు శ్రీనివాస్ రెడ్డి దంపతులు పాల్గొన్నారు. నాగారం డివిజన్ పరిధిలోని శ్రీ మహావారాహి దేవి ఆశాడ గుప్త నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ఐదవ రోజు నిర్వహించిన చండీ హోమంలో నాగారంకు చెందిన అనేక మంది భక్తులు దంపతులు కలిసి భక్తి శ్రద్ధలతో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి అనుగ్రహం ప్రజలందరిపై ఉండాలని, రాష్ట్రంలో సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం వెల్లివిరియాలని ప్రార్థించారు. ఈ పవిత్ర కార్యక్రమంలో నాగారం పరిసర ప్రాంతాల నుంచి విచ్చేసిన అనేక మంది దంపతులు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని చండీ హోమంలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు. శ్రీ మహావారాహి అమ్మవారి ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడుతూ ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంది.'

## రాజ్ సుక్ నగర్, అన్నపూర్ణ కాలనీలలో రోడ్ల సమస్యలు పరిష్కరించాలి...



**నాగారం, జూలై 19:-(జర్నలిస్ట్ డైరీ)** నాగారం డివిజన్ పరిధిలోని రాజ్ సుఖ్ నగర్ అన్నపూర్ణ కాలనీలో నెలకొన్న రోడ్ల సమస్యపై నేడు స్థానిక ప్రజలతో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాగారం డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు భూమయ్య యాదవ్, కాంగ్రెస్ నాయకులు కౌకుట్ల జీవన్ రెడ్డి, శ్రీశైలం, బాల నరసింహ, కాలనీ అధ్యక్షుడు జె. దాసు, జనరల్ సెక్రటరీ వేణుగోపాల్ మరియు కాలనీ వాసులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాలనీలో నెలకొన్న రోడ్ల సమస్యలపై స్థానికులతో విస్తృతంగా చర్చించి వారి అభిప్రాయాలు, సూచనలను తెలుసుకున్నారు. అలాగే 40 అడుగుల ప్రతిపాదిత రహదారికి సంబంధించిన అంశంపైనా చర్చించి, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి ప్రజలకు అనుకూలంగా త్వరితగతిన పరిష్కారం చూపేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

## ప్రజల భద్రతకు సీసీ టీవీ కెమెరాలు ఎంతో కీలకం: నాగోలు ఇన్స్పెక్టర్ మక్బూల్ జానీ..




రామానంద కాలనీలో సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న నాగోలు ఇన్స్పెక్టర్ మాక్బూల్ జానీ

**జర్నలిస్ట్ డైరీ నాగోలు:** నేరాల నియంత్రణ, నేరాల చేదన. ప్రజల భద్రతకు సీసీ టీవీ కెమెరాలు ఎంతో కీలకమైనవని నాగోలు ఇన్స్పెక్టర్ మహమ్మద్ మక్బూల్ జానీ అన్నారు. మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో కమ్యూనిటీ పోలీసింగ్ లో భాగంగా వినూత్నంగా చేపట్టిన 'మీ సురక్ష' కార్యక్రమంలోని 'నేను సైతం 2.0 కార్యక్రమం కింద నాగోలు పోలీస్ స్టేషన్ పరిధిలోని రామానంద కాలనీవాసులు స్వచ్ఛందంగా తమ సొంత ఖర్చుతో 16 సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేసుకున్నారు. ఈ కార్యక్రమాని ముఖ్యఅతిథిగా పాల్గొన్న నాగోలు ఇన్స్పెక్టర్ మక్బూర్ జానీ ఆదివారం కాలనీ వాసులతో కలిసి సీసీ టీవీ కెమెరాలను ప్రారంబించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి కాలనీ, అపార్ట్మెంట్. వ్యాపార సంస్థల్లో సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం ద్వారా నేరాలను నివారించడంతో పాటు నేరస్తులను త్వరగా గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవడం సులభతరం అవుతుందని వివరించారు. ఈ సందర్భంగా ఇన్స్పెక్టర్ మక్బూల్ జానీ మాట్లాడుతూ ప్రతి కాలనీ, అపార్ట్మెంట్, వ్యాపార సంస్థల్లో సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం ద్వారా నేరాలను నివారించడంతో పాటు నేరస్తులను త్వరగా గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవడం సులభతరం అవుతుందని వివరించారు. ప్రజల భాగస్వామ్యంతో పోలీసింగ్ మరింత సమర్థవంతంగా సాగుతుందని పేర్కొంటూ. ఈ కార్యక్రమంలో బాగస్వాములైన రామానంద కాలనీ నివాసులను అబినందించారు. ఈ కార్యక్రమంలో సెక్టర్ సబ్ ఇన్స్పెక్టర్ బి. ఉమ. రామానంద కాలనీ అసోసియేషన్ అధ్యక్షులు ఆర్.ఎస్.ఆర్.ఎ ప్రసాద్, ప్రధాన కార్యదర్శి డి.ఎస్.ఆర్ మూర్తి, కోశాధికారి హనుమంతరావు తదితర కాలనీ ప్రతినిధులు, నివాసులు పాల్గొన్నారు.

జర్నలిస్ట్ డైరీ
తెలుగు దినపత్రిక

# కీసర డబుల్ బెడ్ రూమ్ కాలని కమిటీ ఎన్నిక....



**నాగారం, జూలై 19:-(జర్నలిస్ట్ డైరీ)**
కీసర డబుల్ బెదురూమ్ కాలనీ కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గంగళ వెంకట్ గౌడ్ ఉపాధ్యక్షులుగా కుంంటోళ్ల సత్యనారాయణ, ఎండి సాధిక్ పాషా, ప్రధాన కార్య దర్శి లుగా గంగాపురం రాజు, మేకల కృష్ణ, జూపల్లి వెంకటేష్ సలహా దారులుగా లక్ష్మి నారాయణ, లాలయ్య, సాయిలు, రాజు, రఫీయుద్దీన్ లను ఎన్నుకున్నారు.

# ఉప్పల్ లో పోచమ్మకు కుమ్మరుల తొలి బోనం ముఖ్య అతిథిగా హాజరైన పరమేశ్వర్ రెడ్డి



**నాగారం, జూలై 19:-(జర్నలిస్ట్ డైరీ)**
ఉప్పల్ లో బోనాల సందడి మొదలైంది. ఆదివారం పోచమ్మకు కుమ్మరులు తొలి బోనం చేశారు. కుమ్మరుల తొలి బోనంకు ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.కుమ్మరి పెద్దలతో కలిసి ఈ సందర్భంగా పరమేశ్వర్ రెడ్డి పోచమ్మకు ప్రత్యేక పూజలు చేశారు.కార్యక్రమంలో గుమిడెల్లి నారాయణ, గుమిడెల్లి యాదయ్య, గుమిడెల్లి మల్లేష్, భాస్కర్, బుల్లెట్ కృష్ణ, గుమిడెల్లి రాజు, గుమిడేలి మహేష్, పొట్లూరి కృష్ణ, పొట్లూరి వెంకటేష్, పొట్లూరి శ్రీనివాస్, మహేష్, సదాసాయి భిక్షపతి, గుమిడేలి శ్రీనివాస్, గుమిడెల్లి అశోక్, ప్రశాంత్ రెడ్డి, నరేష్ ముదిరాజ్, తదితరులు పాల్గొన్నారు.

# వీరులారా..వందనం.. మహనీయులారా..వందనం

**-మండల పరిషత్ ముందు మహనీయుల విగ్రహాలు..**

**-గాంధీజీ, గద్దర్, బూర్గుల రామకృష్ణారావు, అబ్దుల్ కలాం, రాజా వెంకటరెడ్డి విగ్రహాల ఆవిష్కరణ..**

**-విగ్రహాలను ఆవిష్కరించిన మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, ఎమ్మెల్సీ కోదండరాం..**

**-భారీ ఎత్తున హాజరైన నాయకులు, కార్యకర్తలు, కుల, ప్రజా సంఘాల నేతలు**



**రంగారెడ్డి జిల్లా బ్యూరో, జూలై 19 (జర్నలిస్ట్ డైరీ) :**
వీరులారా.. వందనం.. మహనీయులారా.. వందనం.. అంటూ దేశ స్వాతంత్రం కోసం ప్రాణాలు అర్పించిన ఉద్యమకారులు, పోరాట యోధులతో పాటు దేశానికి వన్నెతెచ్చిన శాస్త్రవేత్త విగ్రహావిష్కరణల సందడి పట్టణంలోని మండల పరిషత్ వద్ద కనిపించింది. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆధ్వర్యంలో పట్టణంలోని పాత జాతీయ రహదారి పక్కన మండల పరిషత్ ప్రహరీ ముందు జాతిపిత మహాత్మా గాంధీ, బహుముఖ ప్రజ్ఞాశాలి, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావు, స్వతంత్ర పోరాట యోధుడు రాజా వెంకటరెడ్డితో పాటు శాస్త్రవేత్తగా ప్రపంచం వ్యాప్తంగా దేశానికి వన్నె తెచ్చి, రాష్ట్రపతిగా నిస్వార్థ పాలనతో ప్రజల హృదయాలలో నిలిచిపోయిన అబ్దుల్ కలాం, యుద్ధనౌక గద్దర్ విగ్రహాలను మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్సీ కోదండరాంరెడ్డి, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆవిష్కరించారు. ఈ మహనీయుల విగ్రహాలను ఆవిష్కరించడం పట్ల కుల సంఘాల నాయకులు, ఆయా నాయకుల అభిమానులు సంతోషాన్ని వ్యక్తం చేశారు. మున్సిపాలిటీ చైర్మన్ అగునూరు బస్వం, వైస్ చైర్మన్ అందే మోహన్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మొహమ్మద్ అలీ ఖాన్ బాబర్, మాజీ మున్సిపల్ చైర్మన్ అగ్గనూరు విశ్వం గిరిజన ఆదివాసి కోఆర్డినేటర్ పి.రఘు,చెంది తిరుపతి రెడ్డి, కృష్ణారెడ్డి, అగునూరు విశ్వం, సజీవన్, ముబారక్ అలీ ఖాన్ లతోపాటు ఐకాసా నాయకులు, కుల సంఘాల నాయకులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# వాంగ్ చుక్ పై కేంద్ర ప్రభుత్వ అప్రజాస్వామిక కఠిన చర్య

ఢిల్లీ వేసవి ఎండలో 21 రోజుల పాటు నిరాహార దీక్ష చేస్తూ, కేవలం ఉప్పు నీరు మాత్రమే స్వీకరిస్తూ, న్యాయం కోసం నిశ్శబ్దంగా ఎదురుచూస్తున్న వ్యక్తిని శనివారం ఉదయం ఢిల్లీ పోలీసులు బలవంతంగా అపహరించారు. ఈ ఘటన భారత ప్రజాస్వామ్యంలోని అసౌకర్య సత్యాన్ని మరోసారి బయటపెట్టింది: నిరసనకు ప్రజాస్వామ్యబద్ధమైన మార్గాలు మూసుకుపోతున్నాయి, అసమ్మతి స్వరాలను అణచివేయడానికి రాజ్యాంగ యంత్రాంగం ఎంతవరకు ముందుకు వెళ్తుందో ఈ సంఘటన చాటిచెప్పింది. 59 ఏళ్ల పర్యావరణ ఉద్యమకారుడు, విద్యాసంస్కర్త సోనమ్ వాంగ్ చుక్ జూన్ 28న జంతర్ మంతర్ వద్ద నిరవధిక నిరాహార దీక్ష ప్రారంభించారు. నీట్ (ఎన్ఈఈటీ) ప్రశ్నాపత్రం లీక్ కాండతో సహా జాతీయ స్థాయి పరీక్షల్లో పునరావృతమవుతున్న అవకతవకలకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్.టీ.ఏ.)ని రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. వాస్తవానికి 2026 మే 3న నిర్వహించిన (నీట్–యూజీ) పరీక్షను పేపర్ లీక్ ఆరోపణలతో రద్దు చేయడం, ఇందుకు సంబంధించి సీబీఐ దర్యాప్తు ఆదేశించడం జరిగింది. ఈ పరీక్ష 2.28 మిలియన్ల మంది అభ్యర్థుల భవిష్యత్తును ప్రభావితం చేసింది. 'కాక్రోచ్ జనతా పార్టీ' (బీజేపీ) అనే వ్యంగ్యాత్మక ఆన్లైన్ ఉద్యమం ఈ సమస్యను జాతీయ దృష్టికి తెచ్చింది.

వాంగ్ చుక్ ఆరోగ్య పరిస్థితి దినదినాభివృద్ధి క్షీణిస్తుండడంతో ఢిల్లీ హైకోర్టు గురువారం కేంద్ర ప్రభుత్వాన్ని ఆయన ఆరోగ్యాన్ని క్రమం తప్పకుండా పర్యవేక్షించాలని, అవసరమైతే వైద్య సహాయం అందించాలని ఆదేశించింది. శుక్రవారం నాటికి వాంగ్చుక్ 9.1 కిలోల బరువు కోల్పోయారు, ఆయన శరీరం కొవ్వు, కండరాలను విచ్ఛిన్నం చేసుకుంటున్న దశలో ఉంది. వైద్యులు ఆయన రక్తంలో పొటాషియం స్థాయి 4.3 నుండి 2.9కి పడిపోయినట్లు నిర్ధారించారు. ఇది ప్రమాదకరమైన స్థాయి అని, తక్షణ చికిత్స అవసరమని వారు అభిప్రాయపడ్డారు.

అయితే శనివారం ఉదయం 6.30 గంటలకు జరిగినది ఎంతో భిన్నంగా ఉంది. తమను ప్రభుత్వ వైద్యులమని చెప్పుకుంటూ వచ్చిన ఢిల్లీ పోలీసులు, వేదికపైకి దూసుకెళ్లి, వాంగ్ చుక్ పై తెల్లటి బెడ్షీట్ కప్పి, స్ట్రెచర్పై ఎక్కించి సఫ్దర్జంగ్ ఆసుపత్రికి తరలించారు. ఆయన అనుమతి కోరలేదు, కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వలేదు, ఆయన వ్యక్తిగత వైద్యులను దూరంగా ఉంచారు. దీనికి కొంతముందే జంతర్ మంతర్ వద్ద మొబైల్ ఫోన్లు పనిచేయకుండా జామర్లు ఏర్పాటు చేశారు. సంఘటన జరిగిన వెంటనే ప్రపంచానికి తెలియకుండా ఉండేందుకు ఇది ఒక ప్రణాళికాబద్ధమైన వ్యూహమని స్పష్టమవుతోంది.

ఈ బలవంతపు తరలింపు చట్టబద్ధమైనదేనా? ఢిల్లీ పోలీసులు హైకోర్టు ఆదేశాలను, వైద్య సలహాను ఆధారంగా చూపారు. కానీ హైకోర్టు ఎక్కడా



'బలవంతంగా తరలించాలని' ఆదేశించలేదు. ఆరోగ్య పరిస్థితిని పర్యవేక్షించాలని, అవసరమైతే చికిత్స అందించాలని మాత్రమే చెప్పింది. వాంగ్చుక్ భార్య గీతాంజలి ఆంగ్మో 'మా అనుమతి లేకుండా ఎటువంటి చికిత్స అందించవద్దని' డిమాండ్ చేశారు. ఆమె సఫ్దర్జంగ్ ఆసుపత్రిలో చూపిన పొటాషియం స్థాయి (2.9)పై అనుమానం వ్యక్తం చేశారు. స్వతంత్ర ల్యాబ్ పరీక్షలో 3.6 నమోదు కాగా, ఆమె దీనిని సవాలు చేశారు. ఆమె ఢిల్లీ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసి, సఫ్దర్జంగ్ ఆసుపత్రిలో ఆయన కొనసాగడాన్ని 'అక్రమ నిర్బంధం'గా పేర్కొన్నారు. ఈ చర్య వెనుక రాజకీయ ఉద్దేశం కూడా ఉందనడానికి స్పష్టమైన ఆధారాలు ఉన్నాయి. శుక్రవారం కేంద్ర హోం మంత్రిత్వ శాఖ సీనియర్ ఐపిఎస్ అధికారి అనురాగ్ కుమార్ ను ఢిల్లీ పోలీస్ కమిషనర్ గా నియమించింది. ఆయన గతంలో ఇంటెలిజెన్స్ బ్యూరో (ఐబీ) స్పెషల్ డైరెక్టర్గా పనిచేశారు. నియామకం మరుసటి రోజే ఈ కఠిన చర్య జరగడం, ఆయనకు ఇదే మొదటి బ్రీఫింగ్ అయితే 'అది చాలా చిల్లింగ్ మెసేజ్ పంపుతుంది' అని కాంగ్రెస్ నేత పవన్ ఖేరా విమర్శించారు. అదే సమయంలో ప్రతిపక్షాలు ఈ చర్యను తీవ్రంగా ఖండించాయి. ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ 'అసత్య, హింసలే మోదీ ప్రభుత్వపు మూలసూత్రాలు' అని పేర్కొన్నారు. మల్లికార్జున్ ఖర్గే 'ఈ నిరంకుశ ప్రభుత్వం ఎవరినీ వదిలిపెట్టడం లేదు' అని ఆరోపించారు. అరవింద్ కేజ్రీవాల్ 'బలవంతంగా ఎత్తుకెళ్లే బదులు ప్రభుత్వం మాట్లాడి ఉండాలి' అని అభిప్రాయపడ్డారు. సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి ఎంఏ బేబీ ఈ చర్యను 'సర్వాధికార వైఖరి'గా అభివర్ణించారు. సీపీఐ ప్రధాన కార్యదర్శి డి రాజా 'సంభాషణ, జవాబుదారీత్వంపై బలప్రయోగానికి ప్రాధాన్యం' ఇచ్చారు అని విమర్శించారు. వాంగ్ చుక్ ను తరలించిన వెంటనే బీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే జంతర్ మంతర్ వద్దే నిరవధిక నిరాహార దీక్ష ప్రారంభించారు. ఆయన మాట్లాడుతుండగా సంఘ్ పరివార్ మద్దతుదారు ఒకరు ఆయనపై సిరా చల్లడం గమనార్హం. ఎస్ఎఫ్ఐ అధ్యక్షుడు ఆదర్శ్ ఎం సాజీ, సంయుక్త కార్యదర్శి ఐషీ ఘోష్ కూడా 'క్రాంతి కార్నర్' వద్ద నిరాహార దీక్షకు దిగారు. వాంగ్చుక్ విడుదలయ్యే వరకు దీక్ష కొనసాగిస్తామని వారు ప్రకటించారు. ఏఐఎస్ఎఫ్, ఏఐఎస్ఏ, వంటి విద్యార్థి సంఘాలు కూడా ఈ ఉద్యమంలో చేరాయి.

ఈ బలవంతపు తరలింపు గురించి మూడు కీలకమైన అంశాలు స్పష్టమవుతున్నాయి. మొదటిది, వైద్య ఆందోళనలను సాకుగా చూపి, ప్రజాస్వామ్య నిరసనను అణచివేసే పద్ధతికి ఇది ఒక ఉదాహరణ. వాంగ్ చుక్ ఆరోగ్యం క్షీణిస్తున్నా, ఆయనకు కావాల్సింది వైద్య చికిత్స కాదు, న్యాయం. 21 రోజుల పాటు ఆయన డిమాండ్లపై ప్రభుత్వం నామమాత్రంగా కూడా స్పందించలేదు. అయితే వేలాది మంది విద్యార్థులు, యువత పార్లమెంట్ మార్చ్ కు సిద్ధమవుతున్న సమయంలో ఆయనను తొలగించడం, ఆ మార్చ్ ను అడ్డుకునే ప్రయత్నంగా కనిపిస్తుంది. రెండవది, ఈ ఘటన ప్రజాస్వామ్య వ్యవస్థలో 'శాంతియుత నిరసన' అనే ప్రాథమిక హక్కుపై ప్రశ్నలు లేవనెత్తింది. సెక్షన్163 బిఎన్ఎస్ఎస్ కింద న్యూఢిల్లీ జిల్లాలో నిషేధాజ్ఞలు అమలులో ఉన్నాయి. కానీ శాంతియుతంగా, నిశ్శబ్దంగా, ఎవరికీ ఇబ్బంది కలిగించకుండా ఉన్న వ్యక్తిని బలవంతంగా తరలించడం అనేది ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధం. మూడవది, ఈ సంఘటన రాజకీయ ప్రతిపక్షాలను, విద్యార్థి సంఘాలను, సామాజిక ఉద్యమకారులను ఒకే వేదికపైకి తీసుకువచ్చింది. అన్నా హజారే కూడా కేంద్ర ప్రభుత్వం వాంగ్ చుక్ తో మాట్లాడాలని పిలుపునిచ్చారు. వాంగ్ చుక్ ప్రస్తుతం సఫ్దర్జంగ్ ఆసుపత్రిలో ఉన్నారు. ఆయన ఇంకా నిరాహార దీక్ష కొనసాగిస్తున్నారు. ఆయన ఇంట్రావీనస్ ఫ్లూయిడ్స్, మందులు తీసుకోవడానికి నిరాకరించారు. ఆయన భార్య గీతాంజలి హైకోర్టులో తమ పిటిషన్ను కొనసాగిస్తున్నారు. బీజేపీ 'చలో సంసద్' మార్చ్ ను జూలై 20న నిర్వహిస్తామని ప్రకటించింది. కానీ పోలీసులు అనుమతి నిరాకరించారు. ఈ మార్చ్ జరుగుతుందా, ఎలా జరుగుతుందనేది ప్రజాస్వామ్య పరీక్షగా మారింది.

భారతదేశంలో నిరసనలు, ఉద్యమాల చరిత్రలో ఇది మరో అధ్యాయం. ఎమర్జెన్సీ కాలం నుండి నేటి వరకు, అసమ్మతి స్వరాలను అణచివేసే ప్రయత్నాలు జరుగుతూనే ఉన్నాయి. కానీ ప్రతిసారీ ప్రజలు మరింత బలంగా, మరింత నిశ్చయంగా ముందుకు వచ్చారు. ఈ సంఘటన కూడా అలాంటి ఒక మలుపు కావచ్చు. ఎందుకంటే ఇక్కడ ప్రశ్న వాంగ్ చుక్ ఒక్కరి నిరసన మాత్రమే కాదు. ఇది భారతదేశంలోని ప్రతి పౌరుని ప్రాథమిక హక్కుల ప్రశ్న, ప్రజాస్వామ్య విలువల ప్రశ్న, ప్రభుత్వాల జవాబుదారీత్వం గురించిన ప్రశ్న. ప్రభుత్వం ఎంత బలప్రయోగం చేసినా, నిజం, న్యాయం కోసం గొంతెత్తే వారిని ఎప్పటికీ అణచివేయలేము. ఎందుకంటే ప్రజాస్వామ్యం అనేది ప్రభుత్వాల బలం పై కాదు, ప్రజల విశ్వాసంపై నిలుస్తుంది.

**డాక్టర్. కోలాహలం రామ్ కిశోర్.**

# భగాయత్ ఫేస్-2లో సమస్యల పరిష్కారానికి కృషి

**- ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జీ పరమేశ్వర్‌రెడ్డి**



**నాగారం, జూలై 19:-(జర్నలిస్ట్ డైరీ)**
ఉప్పల్ భగాయత్ హెచ్ఎండీఏ లే అవుట్ ఫేస్–2లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేయనున్నట్టుగా ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జీ మందుముల పరమేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. ఇక్కడి వాసవి మెట్రో పోలిస్ గ్రేటెడ్ కమ్యూనిటీ అసోసియేషన్ ఆహ్వానం మేరకు పరమేశ్వర్‌రెడ్డి ఆదివారం పేస్–2లో విస్తృతంగా పర్యటించారు. అసోసియేషన్ ప్రతినిధులతో కలిసి పలు సమస్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా వాసవి మెట్రో పోలిస్ గ్రేటెడ్ కమ్యూనిటీ అసోసియేషన్ ప్రతినిధులు పరమేశ్వర్‌రెడ్డి దృష్టికి పలు సమస్యలను తెచ్చారు. దేవాలయం, కమ్యూనిటీ సెంటర్‌కు కేటాయించిన స్థలాల పరిరక్షణకు ప్రహరీగోడలను నిర్మించాలని కోరారు. ఇదే కాకుండా కాలనీలో పెండింగ్‌లో ఉన్న అప్రోచ్ రహదారులను సైతం నిర్మించడంతో పాటు ఉన్న రహదారులను మరమ్మతు చేయించాలన్నారు. ఇక్కడి ఖాళీ స్థలాలలో వ్యర్థాలను పోస్తుండటంతో దుర్గంధంగా మారిందన్నారు. పోలీసుల నిఘాను సైతం పెంచాలన్నారు.

వాసవి మెట్రో పోలిస్ గ్రేటెడ్ కమ్యూనిటీ అసోసియేషన్ ప్రతినిధులు ప్రస్తావించిన అన్ని రకాల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఈ సందర్భంగా పరమేశ్వర్‌రెడ్డి హామీ ఇచ్చారు. స్థలాల పరిరక్షణకు ప్రహరీగోడల నిర్మాణంతో పాటు రహదారుల ఏర్పాటు, మరమ్మతులను సైతం చేపట్టనున్నట్టుగా చెప్పారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు పాల్గొన్నారు.

# పుష్కర కాలపు కల.. సాకారమైన వేళ..

**-షాద్ నగర్ లో అమరవీరుల స్థూపం ఆవిష్కరణ..**

**-జేఏసీ వినతితో ఎమ్మెల్యే సొంత ఖర్చులతో నిర్మాణం..**

**-ప్రారంభించిన మంత్రి జూపల్లి కృష్ణారావు..**

**-ఎమ్మెల్యే వీర్లపల్లికి ఉద్యమకారుల కృతజ్ఞతలు**





**రంగారెడ్డి జిల్లా బ్యూరో, జూలై 19 (జర్నలిస్ట్ డైరీ) ;**
తెలంగాణ ఉద్యమంలో ప్రాణాలకు తెగించి పోరాడి చివరికి తమ ప్రాణాలను సైతం పణంగా పెట్టి సాధించుకున్న తెలంగాణలో ఇలాంటి అమరవీరుల కోసం ఒక స్తూపం ఏర్పాటు పుష్కర కాలంగా కలగానే మిగిలింది. ఉద్యమాల ఐకాసా నాయకులు ఎన్నిసార్లు ప్రయత్నించినా ఫలితం కనిపించలేదు. చివరికి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కృషితో ఆ ప్రయత్నం సఫలం అయింది. పట్టణంలోని బ్లాక్ ఆఫీస్ ఆవరణలో నిర్మాణం చేపట్టిన అమరవీరుల స్తూపాన్ని ఆదివారం మంత్రి జూపల్లి కృష్ణారావు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా అమరవీరులకు జయ జయ నినాదాలతో ఆ ప్రాంతం మారుమోగింది. ఎమ్మెల్సీ ఆచార్య కోదండరాం, గద్దర్ కూతురు వెన్నెల, శ్రీకాంతాచారి తల్లి శంకరమ్మ కూడా ఈ కార్యక్రమానికి హాజరై అమరవీరులకు నివాళులు అర్పించడం విశేషం. ఐకాసా నాయకులు జనార్ధన్, పినపాక ప్రభాకర్, కరుణాకర్, టీజీ శ్రీనివాస్, గిరిధర్, కృష్ణయ్య, వంగూరి గంగిరెడ్డి, వి. రామారావు, సరాపు జగదీశ్వర్ తొలితరం ఉద్యమకారుడు నాగిళ్ళ గోపాలగుప్త, బిజెపి నాయకుడు శ్రీ వర్ధన్ రెడ్డి, మంగులాల్ నాయక్, కలంకార్ దిలీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు..

జర్నలిస్ట్ డైరీ తెలుగు దినపత్రిక

# ఓటరు జాబితా సవరణలో స్టేషన్ ఘనపూర్ మొదటి స్థానంలో నిలవాలి

**-25వ తేదీ నాటికి 100శాతం పూర్తి చేసి మొదటి స్థానంలో నిలవాలి**
**-అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకొని బి ఎల్ ఏ లు, క్లస్టర్ ఇంచార్జ్ లు పనిచేయాలి**
**-అర్హులైన ఒక్క ఓటు కూడా తొలగిపోకుండా చూసుకోవాలి**
**-బి ఎల్ ఓ లతో సమన్వయం చేసుకొని ఎన్యూమరేషన్ పూర్తి చేయాలి**



**ఉమ్మడి వరంగల్ జూలై 19 (జర్నలిస్ట్ డైరీ)** ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గం రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలవాలని ,ఆ దిశగా ప్రతీ ఒక్క కాంగ్రెస్ పార్టీ కార్యకర్త పని చేయాలని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య , మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు.

ఉమ్మడి వరంగల్ జిల్లా స్టేషన్ ఘన్పూర్ పట్టణ కేంద్రంలో ఓటరు జాబితా సవరణ పై నియోజకవర్గ ఇన్చార్జిలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని అత్యంత బాధ్యతాయుతంగా నిర్వహించాలని, అర్హులైన ఒక్క ఓటు కూడా తొలగిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియను నిర్లక్ష్యంగా తీసుకుంటే భవిష్యత్తులో ప్రజలకు సంక్షేమ పథకాల లబ్ధి అందకుండా ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందన్నారు. అర్హత ఉన్న ప్రతి ఓటరికి ఓటు హక్కు ఉండేలా చర్యలు తీసుకోవాలని, డబుల్ ఓట్లు, చనిపోయిన వారి పేర్లు, నకిలీ ఓట్ల తొలగింపుతో పాటు చట్టబద్ధమైన ఓటు ఎట్టి పరిస్థితుల్లోనూ తొలగిపోకుండా చూడాలని సూచించారు.ప్రస్తుతం నియోజకవర్గంలో సుమారు 80 శాతం ప్రక్రియ పూర్తయిందని, మ్యాపింగ్ పనులు 94 శాతం వరకు జరిగినట్లు తెలిపారు. మిగిలిన రోజులలో ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలను సేకరించాలని, జాబితాలో లేని వారిని ఫోన్ ద్వారా సంప్రదించి నమోదు ప్రక్రియ పూర్తి చేయాలని పార్టీ శ్రేణులకు సూచించారు. బి ఎల్ ఓ లతో నిరంతరం సమన్వయం కొనసాగించాలని, ఎక్కడైనా సమస్యలు ఎదురైతే ఇన్చార్జీలు, వార్‌రూమ్ ప్రతినిధులు, పరిశీలకుల సహకారం తీసుకోవాలని పేర్కొన్నారు. అర్బన్ ప్రాంతాల్లో ఉద్యోగాలు, బదిలీలు, పిల్లల చదువుల కారణంగా ప్రజలు నివాసాలు మారడం వల్ల ఓటర్లను గుర్తించడం కష్టంగా మారుతోందని, అలాంటి ప్రాంతాల్లో మరింత శ్రద్ధ అవసరమన్నారు. రాబోయే స్థానిక సంస్థలు, శాసనసభ, పార్లమెంట్ ఎన్నికలపై కూడా ఈ సవరణ ప్రభావం ఉంటుందని తెలిపారు.

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఎస్ఐఆర్ పేరుతో పెద్ద ఎత్తున ఓట్ల తొలగింపునకు ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ప్రజాస్వామ్య హక్కులను కాపాడేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. నియోజకవర్గంలో కనీసం 95 శాతం వరకు ఓటర్ల ధృవీకరణ పూర్తయ్యేలా కృషి చేయాలని కోరారు.ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గం రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలవాలని అన్నారు. ప్రస్తుతం స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గం రాష్ట్రంలో 4వ స్థానంలోఉన్నట్లు స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జూమ్ మీటింగ్ లో తెలపడం సంతోషంగా ఉందని అన్నారు. స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలో నిబద్ధతతో పని చేస్తున్న క్లస్టర్ ఇంచార్జ్ లు, బిఎల్ఏ లకు అభినందనలు తెలిపారు. 25వ తేదీ మధ్యాహ్నం 3గంటలకు మరోసారి నియోజకవర్గ స్థాయి ఓటరు జాబితా సవరణ కార్యక్రమంపై పూర్తి స్థాయి సమావేశం ఉంటుందని అన్నారు. 25వ తేదీ కి ఇంకా 6రోజుల సమయం ఉందని ఈ 6రోజులలో ప్రతీ బూత్ లో 95శాతం ఎన్యూమరేషన్ పూర్తి చేయాలని సూచించారు. బిఎల్ఏ లు, క్లస్టర్ ఇంచార్జ్ లు, సర్పంచులు, గ్రామ శాఖ అధ్యక్షులు ప్రతీ ఒక్కరూ ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకొని పని చేయాలని తెలిపారు. 25వ తేదీన క్లస్టర్ ఇంచార్జ్ లు, బిఎల్ఏలు, సర్పంచులు, గ్రామ శాఖ అధ్యక్షులతో నియోజకవర్గ స్థాయి సమావేశం ఉంటుందని, ఈ సమావేశానికి క్లస్టర్ ఇంచార్జ్ ల పరిధిలోని బిఎల్ఏలు, సర్పంచులు గ్రామ అధ్యక్షులు సమావేశానికి హాజరయ్యే విధంగా చూసుకోవాల్సిన బాధ్యత క్లస్టర్ ఇంచార్జ్ లదే అని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా 100శాతం ఎన్యూమరేషన్ పూర్తి చేసిన క్లస్టర్ ఇంచార్జ్ లకు కండువా కప్పి సత్కరించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మారుజోడు రాంబాబు, మున్సిపల్ చైర్మన్ తాటికొండ వినయ్ కుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ జూలుకుంట్ల లావణ్య శిరీష్ రెడ్డి, ఓటరు జాబితా సవరణ నియోజకవర్గ ఇంచార్జ్ లింగాల జగదీష్ చందర్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు, క్లస్టర్ ఇంచార్జ్ లు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

# చేగూర్‌లో సిఎన్ ప్రింట్ హబ్ ప్రారంభం

**- ప్రారంభించిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**



**రంగారెడ్డి జిల్లా బ్యూరో, జూలై 19 (జర్నలిస్ట్ డైరీ) ;** నందిగామ మండల పరిధిలోని చేగూర్ గ్రామంలో వెంకమ్మగూడ గ్రామ సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు, వార్డు సభ్యుడు చిర్ర నర్సింలు ఏర్పాటు చేసిన సిఎన్ ప్రింట్ హబ్ను షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో యువత స్వయం ఉపాధి దిశగా అడుగులు వేయడం అభినందనీయమని పేర్కొన్నారు. నూతనంగా ప్రారంభించిన సిఎన్ ప్రింట్ హబ్ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డి, గుండాల స్వాములయ్య పాల్గొని చిర్ర నర్సింలుకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు దేపల్లె కుమార్ గౌడ్, సర్పంచ్‌లు గొర్లపల్లి అశోక్, మంకాల శ్రీశైలం, ఉప సర్పంచ్ ఆవులమంద శివశంకర్, మాజీ ఎంపీపీ శివశంకర్ గౌడ్ నర్సప్పగూడ మాజీ సర్పంచ్ కావలి కృష్ణ యాదవ్ బండోని గూడ పసుల బుచ్చయ్య, వీరేందర్ గౌడ్, బుగ్గ శ్రావణ్, ఆకుల జ్ఞానేశ్వర్, చిందం నరసింహులు, వెంకమ్మగూడ గ్రామస్తులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# "సర్" ప్రక్రియ సాఫీగా సాగేలా సహాయ కేంద్రాలు పని చేయాలి..

**- కాంగ్రెస్ శ్రేణులకు మందుముల పరమేశ్వర్ రెడ్డి పిలుపు**



**నాగారం జూలై 19:-(జర్నలిస్ట్ డైరీ)** సర్ ప్రక్రియ సాఫీగా, వేగవంతంగా సాగేలా ప్రతి కాంగ్రెస్ కార్యకర్త పని చేయాలని ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ పరమేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. శక్తి సాయి నగర్ డివిజన్ అధ్యక్షులు ఎస్వి కృష్ణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సర్ సహాయ కేంద్రాన్ని పరమేశ్వర్ రెడ్డి ఆదివారం పరిశీలించారు. నిజమైన ఓటర్లకు సర్ ప్రక్రియతో ఎలాంటి నష్టం లేకుండా చూడాలని ఈ సందర్భంగా పరమేశ్వర్ రెడ్డి అన్నారు. బీఎల్ఓతో సమన్వయం చేసుకుంటూ ఓటర్లకు సేవలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ నియోజకవర్గ కోర్డినేటర్ శ్రీలత, డివిజన్ అధ్యక్షుడు కృష్ణ, జమీలా బేగం, సాయి గౌడ్, నెమలి అనిల్, రాజు గౌడ్, బాలరాజ్ గౌడ్, పర్వతాలు, నిక్కి బెల్లం గట్టయ్య, అన్వర్ పాషా, నదీమ్, జానీ భాషా, సుజాత, లావణ్య, సోనీ గౌడ్, జేష్రత్ భాను, లలిత, రజని రెడ్డి, విజమ్మ, నరేష్, లక్ష్మి రాజు, ప్రశాంత్, లక్ష్మణ్, శివారెడ్డి, శక్తి సాయి నగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# ఈశ్వరమ్మను పరామర్శించిన ఆర్.కృష్ణయ్య

**అనుచిత వ్యాఖ్యలపై ఆగ్రహం**
**శివ చరణ్ రెడ్డిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్**



**మనసురాబాద్, జూలై19 (జర్నలిస్ట్ డైరీ)** యాదాద్రి బోర్డు మెంబర్ ఈశ్వరమ్మ యాదవ్ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఘటనపై బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య ఆమెను పరామర్శించి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మీరు ఉన్నది ఎంత..!? మీరు ఎంత..!?" అంటూ బీసీ నేతలపై రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తే ఖబడ్దార్ అని హెచ్చరించారు. అగ్రకులాలు బీసీలపై చాలా చోట్ల దాడులు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీలకే పెద్ద దిక్కుగా ఉండే ఈశ్వరమ్మ యాదవ్ పై చేసిన అనుచిత వాక్యాలు క్షమించరానివని, బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ నాయకులకు, పెద్దలకు, ముఖ్యమంత్రి, పీసీ అధ్యక్షునికి సూచన చేస్తూ, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ యూత్ అధ్యక్షుడు జక్కిడి శివ చరణ్ రెడ్డి పై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విధమైన వైఖరి మంచిది కాదని, దీంతో కాంగ్రెస్ పార్టీకి డ్యామేజ్ అవుతుందని, పార్టీకి బీసీలు దూరం అయ్యే అవకాశాలు ఉన్నాయని సూచించారు. నాగర్ కర్నూల్ లో అగ్రకులాలు బీసీలపై దాడులు చేశాయని, నల్గొండలో యాదవ్ సోదరులు సర్పంచ్ నామినేషన్ వేయకుండా దాడులు చేశారని, కరీంనగర్లో నాయి బ్రాహ్మణులను కుల బహిష్కరణ చేశారని, నిజామాబాదులో రజకులను కుల బహిష్కరణ చేశారని, అదిలాబాదులో యాదవులపై దాడులు జరిగాయని ఆయన వివరించారు.ఇప్పటికైనా ముఖ్యమంత్రి గారు చొరవ తీసుకొని క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని, తీసుకోకపోతే కాంగ్రెస్ పార్టీ తీవ్రమైన నష్టంతో పాటు బీసీలు దూరమయ్యే అవకాశం ఉందని హెచ్చరించారు.

# ఈ నెల 21న కొడంగల్ కు సీఎం రేవంత్ రెడ్డి

**దుద్యాల మండలం హకీంపేట్ లో జరిగే అభివృద్ధి పనులను సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా పర్యవేక్షణ చేయనున్నారు**
**సీఎం రాకతో భద్రత ఏర్పాట్లలో ముమ్మరంగా నిమగ్నమైన అధికారులు**



**జర్నలిస్ట్ డైరీ కొడంగల్ జులై 19:-** వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గంలో ఈ నెల 21న (మంగళవారం) ముఖ్యమంత్రి ఎ రేవంత్ రెడ్డి కొడంగల్ పరిధిలోని దుద్యాల మండలం హకీంపేటలో పర్యటించనున్నారు.సీఎం పర్యటన ఖరారైన నేపథ్యంలో స్థానిక రెవెన్యూ పోలీస్ వివిధ శాఖల అధికారులు ముందస్తు భద్రత ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు.ఇందులో భాగంగా ఆదివారం నాడు కాడ ప్రత్యేక అధికారి వెంకట్ రెడ్డి ఆర్అండ్ బి డీఈ సురేందర్,దుద్యాల తహసీల్దార్,ఎస్సై కొడంగల్ సీఐ తదితర ఉన్నతాధికారులు హకీంపేటలో క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టారు.సీఎం ప్రయాణించే మార్గాలు హెలిప్యాడ్ స్థలం సమీక్షా సమావేశం జరిగే ప్రాంతాలను పరిశీలించి ఏర్పాట్లపై అధికారులకు దిశానిర్దేశం చేశారు.ఈ పర్యటనలో హకీంపేట పరిధిలో కొనసాగుతున్న పలు కీలక అభివృద్ధి కార్యక్రమాలను ముఖ్యమంత్రి స్వయంగా పరిశీలించనున్నారు.ఆ తర్వాత జిల్లా స్థాయి ఉన్నతాధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పనుల పురోగతిని సమీక్షించి అధికారులతో సమగ్ర సమావేశం నిర్వహించనున్నారు.ఈ సమీక్షలో ముఖ్యంగా హకీంపేట లగచర్ల పోలేపల్లి గ్రామాల్లో ప్రతిపాదిత పారిశ్రామిక అభివృద్ధి పనులు భూసేకరణ పురోగతి మౌలిక వసతుల కల్పనపై సీఎం ప్రత్యేక దృష్టి సారించనున్నారు.అలాగే నియోజకవర్గంలో కొత్తగా మంజూరైన రహదారులు పెండింగ్ ప్రాజెక్టుల పనులను త్వరితగతిన పూర్తి చేయడంపై అధికారులకు ఆదేశాలు ఇవ్వనున్నారు.వీటితో పాటు ప్రజా సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయిలో అర్హులకు అందుతున్న తీరును కూడా అధికారులను అడిగి తెలుసుకోనున్నారు.ముఖ్యమంత్రి రాకను పురస్కరించుకుని నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు స్థానిక యంత్రాంగం పర్యటన విజయవంతానికి భారీ ఏర్పాట్లు చేస్తుండగా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ముందస్తుగా కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టానున్నరు

# ఎల్బీనగర్ పిఎస్ పరిధిలో గుర్తు తెలియని వ్యక్తి మృతి..



మృతి చెందిన గుర్తు తెలియని వ్యక్తి,

**జర్నలిస్ట్ డైరీ: ఎల్బీనగర్:** గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన ఎల్బీనగర్ పోలీస్ స్టేషన పరిధిలో చోటు చేసుకుంది. ఎల్బీనగర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గత రెండు రోజుల క్రితం సరూర్నగర్ ఇండోర్ స్టేడియం వద్ద ఫుట్పాత్పై గుర్తుతెలియని వ్యక్తి పడిపోయి ఉన్నాడు. స్థానికులు గమనించి ఎల్బీనగర్ పోలీస్ లకు సమాచారం ఇచ్చారు. అక్కడకు వచ్చిన ఎల్బీనగర్ పోలీస్లు కింద పడిపోయిన వ్యక్తిని పరిశీలించారు. అతను అప్పటికే మృతి చెందాడు. మృతి చెందిన వ్యక్తి ఎలాంటి గుర్తుపు లబించలేదని అతని వయస్సు (45) ఉంటుందని పోలీస్లు తెలిపారు. ఈ మేరకు ఎల్బీనగర్ పోలీసులు కేసు మృతదేహాన్ని పోస్లామార్థం నిమిత్తం ఉస్మానియా హాస్పిటల్కు తరలించారు. అనంతరం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# సర్ ప్రక్రియను వేగవంతం చేయాలి: ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు




**ఉమ్మడి వరంగల్, జూలై 19 (జర్నలిస్ట్ డైరీ)** తెలంగాణలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఎస్ఐఆర్ ప్రక్రియ మరింత వేగవంతం చేయాలని వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే,విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు అన్నారు.ఆదివారం హన్మకొండలోని సర్క్యూట్ గెస్ట్ హౌస్ లో హన్మకొండ జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు దిలీప్ రాజ్ అధ్యక్షతన నిర్వహించిన సర్ ప్రక్రియ సమీక్ష కార్యక్రమంలో ఎమ్మెల్సీ కేతావత్ శంకర్ నాయక్ , టిటిపిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ల శ్రీను బాబు ,సర్ ప్రక్రియ ఇంచార్జ్ నజీర్, ఎమ్మెల్యే నాగరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఓటర్లకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా నిర్దేశిత గడువులోగా ప్రక్రియను, పారదర్శకంగా పూర్తి చేయాలని అన్నారు.ఓటర్లు స్వచ్ఛందంగా తమ వివరాలు నమోదు చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు.బీఎల్ఏ లు ఇంటింటికి వెళ్లి ఫారాలు నింపి వేగవంతం చేయాలన్నారు. అర్హుడైన ప్రతి పౌరుడి ఓటు హక్కు కాపాడాలని పిపునిచ్చారు. సర్ ప్రక్రియ త్వరగా పూర్తి చేసిన మొదటి వంద మంది బూత్ లెవెల్ ఏజెంట్లకు లోక్ సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ చే సన్మానం కార్యక్రమంఉంటుందన్నారుముందుగా పెట్రోల్ దాడిలో మృతి చెందిన కాంగ్రెస్ నాయకుడు అడుప మహేష్ ఆత్మ శాంతించాలని మౌనం పాటించి సంతాపం తెలిపారు.ఈ కార్యక్రమంలో వరంగల్ డీసీసీ అధ్యక్షుడు మహమ్మద్ ఆయుబ్,సర్ కోఆర్డినేటర్రావలిరెడ్డి,నియోజకవర్గ,డివిజన్,మండల,గ్రామ ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# బిజినెస్

## టెక్నాలజీ దిగ్గజం శాంసంగ్ కీలక నిర్ణయం..

-అమెరికాలో భారీగా ఉద్యోగాల కోత




ప్రముఖ టెక్నాలజీ దిగ్గజం శాంసంగ్ ఎలక్ట్రానిక్స్ అమెరికా లో తన కార్యకలాపాలను పునర్వ్యవస్థీకరించే దిశగా కీలక నిర్ణయం తీసుకుంది. న్యూజెర్సీ లోని తన శాంసంగ్ ఎలక్ట్రానిక్స్ అమెరికా (ఎస్ఈఏ) ప్రధాన కార్యాలయాన్ని టెక్సాస్‌కు తరలించడంతో పాటు, పెద్ద ఎత్తున ఉద్యోగాల కోతను ప్రకటించింది. ఈ మార్పుల వల్ల వందలాది మంది ఉద్యోగులపై ప్రభావం పడనుంది. ప్రధాన కార్యాలయాన్ని న్యూజెర్సీలోని ఎంగిల్‌వుడ్ క్లిఫ్స్ నుంచి టెక్సాస్‌లోని ప్లానోకు తరలించే ప్రక్రియలో భాగంగా 739 ఉద్యోగాలపై ప్రభావం పడుతుందని శాంసంగ్ ధృవీకరించింది.వీరిలో ఎక్కువ మందికి టెక్సాస్‌కు మారేందుకు అవకాశం కల్పించగా.. ఆసక్తి చూపని వారిని విధుల నుంచి తొలగించారు. దీనికి అదనంగా టెక్సాస్‌లోని ప్లానో కార్యాలయంలో మొబైల్ విభాగంతో సహా సుమారు 100 మంది ఉద్యోగులను కూడా తొలగించినట్లు కంపెనీ అంతర్గత పత్రాల ద్వారా వెల్లడైంది. జూన్ 30న సంస్థ వ్యాప్తంగా ఉద్యోగాల కోత ఉంటుందని ఉద్యోగులకు సమాచారం అందినట్లు తెలుస్తోంది. గత కొన్ని వారాలుగా 30 మందికి పైగా సీనియర్ సేల్స్, మార్కెటింగ్ సిబ్బంది తాము కంపెనీని వీడుతున్నట్లు లింక్డ్‌ఇన్‌లో పోస్టులు పెట్టారు. ఈ మార్పులపై శాంసంగ్ స్పందిస్తూ.. 'వివిధ బృందాలను ఒకేచోటికి తీసుకురావడం ద్వారా సంస్థాగత సామర్థ్యాన్ని పెంచేందుకు, మెరుగైన సహకార వాతావరణాన్ని సృష్టించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నాం. వేగంగా అభివృద్ధి చెందుతున్న టెక్నాలజీ, ఏఐ ఎకోసిస్టమ్‌లో భాగం కావాలనే లక్ష్యంతోనే టెక్సాస్‌కు మారుతున్నాం' అని వివరించింది. ఇది ప్రపంచవ్యాప్త పునర్వ్యవస్థీకరణ కాదని, కేవలం అమెరికాలోని కార్యకలాపాలను ప్రస్తుత వ్యాపార ప్రాధాన్యతలకు అనుగుణంగా మార్చడమేనని స్పష్టం చేసింది.

## కొత్త లుక్‌తో రాబోతున్న టయోటా హైలక్స్..తొలి టీజర్ లాంచ్..!

జపాన్‌కు చెందిన ప్రముఖ ఆటోమొబైల్ తయారీ సంస్థ టయోటా తన నెక్స్ట్ జనరేషన్ టయోటా హైలక్స్ పికప్ ట్రక్‌కు సంబంధించిన తొలి టీజర్‌ను అధికారికంగా విడుదల చేసింది. ఈ కొత్త హైలక్స్ 2026 జూలై 28న ప్రపంచవ్యాప్తంగా అధికారికంగా ఆవిష్కరించబడనుంది. తాజా డిజైన్, ఆధునిక ఫీచర్లతో ఈ మోడల్ మార్కెట్లోకి రానుండటంతో ఆటోమొబైల్ ప్రియుల్లో ఆసక్తి నెలకొంది.

**కొత్త డిజైన్:** విడుదల చేసిన టీజర్‌లో కొత్త టయోటా హైలక్స్ ఆరెంజ్, బ్రాంజ్ రంగులో కనిపిస్తోంది. ముందు భాగంలో సిల్వర్ స్కిడ్ ప్లేట్, హనీకాంబ్ డిజైన్ సెంటర్ గ్రిల్, స్లీక్ LED హెడ్‌ల్యాంప్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. హెడ్‌లైట్ల మధ్యలో ఉన్న బ్లాక్ ప్లాస్టిక్ ట్రిమ్‌పై పెద్ద అక్షరాల్లో టయోటా లోగోను అమర్చారు. పూర్తి డిజైన్‌ను కంపెనీ ఇంకా వెల్లడించకపోయినా, కొత్త మోడల్ మరింత బలమైన, ఆధునిక రూపాన్ని సంతరించుకున్నట్లు టీజర్ సూచిస్తోంది.

ఇంటీరియర్: భారత్‌లో విడుదలయ్యే టయోటా హైలక్స్ ఇంటీరియర్‌ను కంపెనీ ఇంకా అధికారికంగా చూపించలేదు. అయితే, గ్లోబల్ మోడల్ తరహాలో డబుల్ క్యాబ్ కాన్ఫిగరేషన్ కొనసాగనుంది. ఇందులో లెదర్‌తో కప్పిన స్టీరింగ్ వీల్‌పై పెద్ద టయోటా లోగో





ఉంటుంది. అలాగే 12.3 అంగుళాల డిజిటల్ డ్రైవర్ డిస్‌ప్లే, 12.3 అంగుళాల టచ్‌స్క్రీన్ ఇన్ఫోటైన్‌మెంట్ సిస్టమ్ అందించే అవకాశం ఉంది. డ్రైవర్ డిస్‌ప్లేలో నాలుగు వేర్వేరు డిస్‌ప్లే థీమ్‌లు ఉండగా, ఇన్ఫోటైన్‌మెంట్ సిస్టమ్ టయోటా స్మార్ట్ కనెక్ట్ టెక్నాలజీపై పనిచేస్తుంది.

**భారతీయ మోడల్‌లో ఉండే ఫీచర్లు:** భారత్‌లో వచ్చే టయోటా హైలక్స్ లో వైర్‌లెస్ అయేలే కార్ ప్లే, ఆండ్రాయిడ్ ఆటో, వైర్‌లెస్ ఛార్జింగ్, డ్యుయల్-జోన్ ఆటోమేటిక్ క్లైమేట్ కంట్రోల్, సరౌండ్ వ్యూ కెమెరా, అదనపు స్టోరేజ్ క్యూబీలు వంటి ప్రీమియం ఫీచర్లు ఉండే అవకాశం ఉంది. అదేవిధంగా ఎహాజ నియంత్రణలు, ఫోర్-వీల్ డ్రైవ్ సెట్టింగ్స్ కోసం ప్రత్యేక బటన్ లు, సాంప్రదాయ స్విచ్‌గియర్‌ను కూడా అందించనున్నారు.

**ఇంజిన్‌లో పెద్ద మార్పులు ఉండకపోవచ్చు:** కొత్త హైలక్స్ ఇంజిన్ వివరాలను టయోటా ఇంకా అధికారికంగా ప్రకటించలేదు. అయితే, ప్రస్తుత మోడల్‌లో ఉన్న 2.8 లీటర్, నాలుగు సిలిండర్ల డీజిల్ ఇంజిన్నే కొనసాగించే అవకాశం ఉందని సమాచారం. ఈ ఇంజిన్ 240 హెచ్‌పీ పవర్, 500చీఎ టార్క్ ఉత్పత్తి చేస్తుంది. అదే ఇంజిన్‌తో పాటు ప్రస్తుతం ఉన్న గేర్‌బాక్స్ ఎంపికలు కూడా కొనసాగవచ్చని అంచనా. విడుదల ఎప్పుడు?: టయోటా కొత్త తరం హైలక్స్‌ను జూలై 28, 2026న అధికారికంగా ఆవిష్కరించనుంది. ఆ సందర్భంగా పూర్తి డిజైన్, సాంకేతిక వివరాలు, అంతర్జాతీయ మార్కెట్లలో లాంచ్ వివరాలను వెల్లడించే అవకాశం ఉంది. భారత్‌లో ఈ పికప్ ట్రక్ విడుదలపై కూడా త్వరలోనే స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

## ఆకాశాన్నంటుతున్న గుడ్లు, చికెన్ ధరలు.. కారణాలు ఇవే!

దేశవ్యాప్తంగా గుడ్లు, చికెన్ ధరలు భారీగా పెరుగుతున్నాయి. మార్కెట్లో ఒక్కో గుడ్డు రూ. 8.5 నుండి 9 కి చేరగా, కిలో చికెన్ ధర రూ. 300 దాటింది. జూన్ వరకు ఉన్న తీవ్రమైన ఎండల వల్ల కోళ్ల ఉత్పత్తి తగ్గడం, ఇథనాల్ తయారీ వల్ల మొక్కజొన్నకు డిమాండ్ పెరగడం, సోయాబీన్ కొరతతో కోళ్ల మేత ధరలు 64% పైగా పెరగడమే దీనికి కారణం. అయితే శ్రావణ మాసంలో డిమాండ్ తగ్గడం వల్ల జులై నెలాఖరు నుండి ధరలు కాస్త తగ్గే అవకాశం ఉంది.





## లార్డ్స్‌లో రోహిత్ సూపర్ సెంచరీ.. ఇంగ్లండ్‌పై అరుదైన ఫీట్..!







భారత మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ వీడ్కోలు వార్తలకు చెక్ పెడుతూ లార్డ్స్‌లో శతకంతో చెలరేగాడు. ఆరంభంలో నిదానంగా ఆడిన హిట్‌మ్యాన్ అర్ధ శతకం తర్వాత జోరు పెంచి సెంచరీ సాధించాడు. రషీద్ ఓవర్లో బౌండరీతో వన్డేల్లో 34వ వంద కొట్టేశాడీ ఓపెనర్. అంతేకాదు పర్యాటక జట్టు ఆటగాడిగా ఇంగ్లండ్‌పై అత్యధిక శతకాల రికార్డును సొంతం చేసుకున్నాడీ బ్యాటర్. వన్డే ఫార్మాట్లో లార్డ్స్‌లో వంద కొట్టిన మొదటి భారత క్రికెటర్ రోహితే కావడం విశేషం.లార్డ్స్‌లో టీమిండియా ఓపెనర్ రోహిత్ శర్మ చిరస్మరణీయ శతకం సాధించాడు. వరసగా రెండు మ్యాచుల్లో విఫలమవ్వడం, ఓవైపు వీడ్కోలు ఒత్తిడి.. ఈ రెండింటి చిత్తు చేయాలని క్రీజునంటుకున్న రోహిత్ వన్డేల్లో 34వ సెంచరీతో రెచ్చిపోయాడు. మూడంకెల స్కోర్ అందుకోగానే లార్డ్స్ బాల్కనీలో కూర్చుకున్న కోచ్ గౌతం గంభీర్ వైపు బ్యాట్ చూపిన హిట్‌మ్యాన్.. సంబురాలు మాత్రం చేసుకోలేదు. 388 పరుగుల ఛేదనలో జట్టును గెలిపించే బాధ్యత మిగిలే ఉంది కాబట్టి.. అతడు హెల్మెట్ కూడా తీయకుండా బ్యాట్ పైకి ఎత్తాడంతే.ఇక.. ఇంగ్లండ్ గడ్డపై వన్డేల్లో అతడికిది 8వ సెంచరీ. దాంతో, అత్యధిక శతకాలు బాదిన పర్యాటక ఆటగాడిగా అవతరించాడు హిట్‌మ్యాన్. ఇంగ్లండ్‌పే ఏడేసి సెంచరీలతో సచిన్ టెండూల్కర్, సయీద్ అన్వర్, క్వింటన్ డికాక్, ఏబీ డివిలియర్స్ తర్వాతి స్థానాల్లో కొనసాగుతున్నారు.

## రోడ్డు ప్రమాదంలో అమెరికా బాక్సర్ దుర్మరణం..!

అమెరికా మహిళల బాక్సింగ్‌లో రాణిస్తున్న హన్నా రాప్ దుర్మరణం చెందింది. జూలై 18, శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో 26 ఏళ్ల హన్నా కన్నుమూసింది. టెక్సాస్‌లో సైకిల్ తొక్కుతుండగా ఓ కారు ఆమెను బలంగా ఢీకొట్టింది. దాంతో, తీవ్రంగా గాయపడిన హన్నా ప్రాణాలు కోల్పోయింది. బాక్సర్ మృతికి కారణమైన కారు డ్రైవర్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు.బ్రాజోస్ కౌంటీ షెరిఫ్స్ ఆఫీస్ కథనం ప్రకారం.. ఉదయం 10 గంటల సమయంలో సైక్లింగ్ చేస్తున్న హన్నా రాప్‌ను కారు ఢీకొట్టింది. అతివేగంగా దూసుకొచ్చిన కారు.. ఇద్దరు సైక్లిస్టులను దాటి హన్నా సైకిల్‌ను తాకింది. ప్రమాదం తీవ్రతకు రక్తమోడిన బాక్సర్‌కు వెంటనే ప్రథమ చికిత్స అందించి ఆస్పత్రికి తీసకెళ్లారు. హాస్పిటల్లో చికిత్స పొందుతూ హన్నా ప్రాణాలు విడిచింది. కేసు నమోదు చేశామని, దర్యాప్తు కొనసాగుతోందని పోలీసులు తెలిపారు.అమెరికాలో మహిళల బాక్సింగ్‌లో సంచలనంగా మారిన హన్నా రాప్ మృతితో స్థానికంగా విషాదం నెలకొంది. హన్నా అకాల మరణం పట్ల ప్రపంచ బాక్సింగ్ మండలి







అధ్యక్షుడు మౌరిసియో సులైమన్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశాడు. అమెరికా బాక్సింగ్‌లో హన్నా లోటును ఎవరూ పూడ్చలేరని పేర్కొన్నాడు. హన్నా అద్భుతమైన బక్సార్. అన్నికంటే ముఖ్యంగా.. తను మా బాక్సింగ్ కుటుంబంలో ఎంతో విలువైన సభ్యురాలు. ఆ విషాద సమయంలో హన్నా కుటుంబ సభ్యులు, స్నేహితులు, బంధువులతో కలిసి బాధను పంచుకుంటాం అని సులైమన్ వెల్లడించాడు.

# స్పోర్ట్స్

## జపాన్ ఓపెన్ విజేతగా పీవీ సింధు..

చరిత్ర సృష్టించిన భారత షట్లర్




భారత షట్లర్ పీవీ సింధు చరిత్ర సృష్టించింది. జపాన్ ఓపెన్ టైటిల్ గెలిచిన తొలి భారత షట్లర్‌గా రికార్డు సాధించింది. మహిళల సింగిల్స్ ఫైనల్‌లో జపాన్ స్టార్ ప్లేయర్ యమగుచిని వరుసగా గేమ్‌ల్లో ఓడించి ఈ టైటిల్‌ను గెలుచుకుంది. హోరాహోరీగా సాగిన ఈ పోరులో 21-17, 21-17 తేడాతో విజయం సాధించింది. మహిళల సింగిల్స్ మ్యాచ్ ప్రారంభం నుంచే పీవీ సింధు దూకుడుగా ఆడింది. క్రాస్‌కోర్ట్ డ్రాప్స్, శక్తివంతమైన స్మాష్‌తో యమగుచిపై ఒత్తిడి పెంచింది. తొలి గేమ్‌లో చివరి వరకు హోరాహోరీ పోరు సాగినా.. కీలక సమయాల్లో వరుస పాయింట్లు సాధించిన సింధు 21-17తో గేమ్‌ను తన ఖాతాలో వేసింది. మొదటి గేమ్‌ను గెలిచిన ఊపుతో రెండో గేమ్‌లోనూ సింధు మరింత దూకుడు పెంచింది. యమగుచి నెట్ గేమ్‌ను సమర్థంగా ఎదుర్కొంటూ.. 21-17తో రెండో గేమ్‌ను ముగించి టైటిల్‌ను సొంతం చేసుకుంది. కాగా, 2024లో సయ్యద్ మోదీ ఇంటర్నేషనల్ గెలిచిన తర్వాత సింధుకు ఇదే తొలి అంతర్జాతీయ టైటిల్ కావడం గమనార్హం.

జర్నలిస్ట్ డైరీ
తెలుగు దినపత్రిక

# కేజీఎఫ్ డైరెక్టర్ హార్రర్ సినిమా..
# 418 రిలీజ్ టైం ఫిక్స్




మూవీ లవర్స్‌కు కమర్షియల్ ఎంటర్‌టైనర్లను అందించిన బ్యానర్లలో టాప్‌లో ఉంటుంది మైత్రీ మూవీ మేకర్స్. కానీ ఈ వెంచర్‌లో ఇప్పటివరకు హార్రర్ జోనర్‌లో మాత్రం సినిమా రాలేదు. ఈ సారి మైత్రీ మూవీ మేకర్స్ 418 సినిమాతో హార్రర్ జోనర్‌లోకి తొలిసారి ఎంటరైంది. పతంగ్ సినిమాతో మంచి గుర్తింపు తెచ్చుకున్న ఇంటర్నెట్, సోషల్ మీడియా పర్సనాలిటీ ప్రీతి పగడాల ఈ మూవీలో లీడ్ రోల్‌లో నటిస్తుండగా.. చరణ్ లక్కరాజు, సూర్య రాజ్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. కీర్తన్ నాదగౌడ డైరెక్ట్ చేస్తున్న ఈ సినిమాను కేజీఎఫ్ డైరెక్టర్ ప్రశాంత్ నీల్ సమర్పిస్తున్నాడు.తెలుగు హార్రర్ ఫిల్మ్ విడుదల తేదీని ప్రకటించారు. 418 చిత్రాన్ని జులై 31న గ్రాండ్‌గా విడుదలచేస్తున్నట్టు ప్రకటించారు. ముంగురులు తిరిగిన పొడవాటి కురులతో ఉన్న ఓ యువతికూర్చున్న బ్యాక్ లుక్‌ను షేర్ చేయగా.. సినిమాపై క్యూరియాసిటీ పెంచేస్తుంది. దినేశ్ దినకరన్, సినిమాటోగ్రఫర్‌గా పనిచేస్తున్న ఈ చిత్రానికి వెంకీ జీజీ మ్యూజిక్ కంపోజర్‌గా వ్యవహరిస్తున్నాడు.



## అందాల గత్తర లేపిన రకుల్..

# తగ్గేదేలే.. రిషబ్ శెట్టి కాంతార చాప్టర్ 1 మరో అరుదైన రికార్డు..!



శాండల్‌వుడ్ నుంచి రిలీజ్ తెలుగుతోపాటు గ్లోబర్ బాక్సాఫీస్‌ను షేక్ చేసిన చిత్రాల్లో టాప్‌లో ఉంటుంది కాంతార. కన్నడ స్టార్ రిషబ్ శెట్టి స్వీయ దర్శకత్వంలో లీడ్ రోల్‌లో నటించిన పాన్ ఇండియా ప్రాజెక్ట్‌కు ప్రీక్వెల్‌గా కాంతార చాప్టర్ 1 వచ్చిందని తెలిసందే. తెలుగు, తమిళం, హిందీ, మలయాళం, కన్నడ భాషల్లో గ్రాండ్‌గా విడుదలైన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద ట్రెండ్ క్రియేట్ చేసింది. 2025లో విడుదలై హయ్యెస్ట్ గ్రాస్ సాధించిన భారతీయ సినిమాల జాబితాలో టాప్‌లో నిలిచిన కాంతార చాప్టర్ 1 ఖాతాలో అత్యంత అరుదైన రికార్డు నమోదైంది. బీ అజనీష్ లోక్‌నాథ్ కంపోజ్ చేసిన బ్రహ్మలక్ష సాంగ్ 1 మిలియన్స్ రీల్స్ అధిగమించిన తొలి కన్నడ పాటగా అరుదైన ఫీట్ నమోదు చేసింది. ప్రపంచవ్యాప్తంగా మూవీ లవర్స్ విస్తృతంగా రీల్స్ చేయడంతో ఈ చారిత్రక మైల్‌స్టోన్ రికార్డైంది. సినిమా విడుదలైన ఏడాది దాటినా రికార్డులు క్రియేట్‌చేస్తూ టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా నిలుస్తోంది. డివైన్, మిథికల్ డ్రామా నేపథ్యంలో తెరకెక్కిన ఈ మూవీలో రుక్మిణి వసంత్ ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటించగా.. జయరామ్, ప్రమోద్ శెట్టి, ప్రకాశ్ తుమినాడ్, గుల్షన్ దేవయ్య ఇతర కీలక పాత్రలు పోషించారు. కాంతార 3 కూడా రాబోతుండగా.. త్వరలోనే సెట్స్‌పైకి వెళ్లనున్నట్టు సమాచారం.



# లైగర్' హీరోయిన్‌కు చేదు అనుభవం..

### నడుముపై చేతులు వేసి అసభ్యకరంగా..


ఈ మధ్యన సినిమా హీరోయిన్లు బయటకు రావాలంటేనే భయపడుతున్నారు. ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా పబ్లిక్ ఈవెంట్స్ లో కొంతమంది వల్ల వారికి తరచూ ఇబ్బందులు ఎదురవుతూనే ఉన్నాయి. ఎక్కడ పడితే అక్కడ చేతులు వేస్తూ హీరోయిన్లను అసౌకర్యానికి గురి చేస్తున్నారు. ఆ మధ్య ఓ సినిమా ఈవెంట్‌లో హీరోయిన్ రష్మిక భుజాలపై బాలీవుడ్ హీరో చేతులు వేయడంతో ఆమె తీవ్ర అసౌకర్యానికి గురైన సంగతి తెలిసిందే. ఆ వీడియో కూడా నెట్టింట బాగా వైరల్ అయింది. ఇక మొన్నటికి మొన్న ధురంధర్ సింగర్ కు కూడా ఇలాంటి పరిస్థితే ఎదురైంది. తాజాగా 'లైగర్' హీరోయిన్ అనన్యా పాండేకు కూడా ఇలాంటి చేదు అనుభవమే ఎదురైంది. వివరాల్లోకి వెళితే.. ఈ మధ్యన సినిమాలతో పాటు ఫ్యాషన్ ఈవెంట్లకు కూడా హాజరవుతోంది అనన్య. అలా తాజాగా ఆమె ముంబైలో ప్రముఖ ఫ్యాషన్ డిజైనర్ గౌరవ్ గుప్తా నిర్వహించిన ఫ్యాషన్ షోకి హాజరైంది. అక్కడ ర్యాంప్ వాక్ చేసి షో స్టార్ గా నిలిచింది. ఇక్కడి వరకు బాగానే ఉంది కానీ.. ఫ్యాషన్ షో ముగిసిన తర్వాత గౌరవ్ గుప్తాతో కలిసి వేదికపైకి వచ్చి ఫొటోలకు పోజులిచ్చింది అనన్య. అయితే, ఈ సమయంలో అతను ఆ హీరోయిన్ తో కాస్త చనువుగా ప్రవర్తించాడు. అనన్య నడుముపై చేతులు వేసి అసభ్యకరంగా ప్రవర్తించాడు. అతను అలా చేసే సరికి అనన్య కూడా తీవ్ర అసౌకర్యానికి గురైంది. అయితే స్టేజ్ పై ఉండంతో నవ్వుతూనే పక్కకు తప్పుకొని గౌరవ్ కు థ్యాంక్స్ చెప్పి అక్కడి నుంచి వెళ్లిపోయింది. ఇందుకు సంబంధించిన వీడియో ఇప్పుడు నెట్టింట వైరల్ గా మారింది.అనన్య పాండేకు సంబంధించిన ఈ వీడియోపై నెటిజన్లు భిన్న రకాలుగా స్పందిస్తున్నారు. డిజైనర్ గౌరవ్ గుప్తా వ్యవహరించిన తీరుని తప్పుపడుతూ చాలా మంది నెటిజన్లు అనన్యకు మద్దతుగా కామెంట్స్ పెడుతున్నారు. అదే సమయంలో మరికొంతమంది మాత్రం గౌరవ్ కు సపోర్టుగా కామెంట్స్ పెడుతున్నారు. గౌరవ్ సరదాగా అలా చేశాడని.. అనన్యతో అతనికి మంచి స్నేహబంధం ఉందని అభిప్రాయపడుతున్నారు.

# అందరి ముందు తన ప్రేమను బయటపెట్టాడు..
## నేను సరే అన్నాను.. హీరోయిన్ అనుష్క.



టాలీవుడ్ లేడీ సూపర్‌స్టార్, 'జెజమ్మ' అనుష్క శెట్టి పేరు వినగానే అరుంధతి, బాహుబలి, భాగమతి వంటి భారీ చిత్రాలు గుర్తుకువస్తాయి. నటనతోనే కాకుండా తన హుందాతనంతో కోట్లాది మంది అభిమానులను సంపాదించుకున్న ఈ మంగళూరు బ్యూటీ.. తాజాగా తన పాఠశాల రోజుల్లో జరిగిన మొదటి లవ్ ప్రపోజల్ తాలూకు ఆసక్తికరమైన విషయాన్ని పంచుకున్నారు. ఆమె చేసిన ఈ వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో బాగా వైరల్ అవుతున్నాయి. సాధారణంగా సెలబ్రిటీల వ్యక్తిగత జీవితాలు, ముఖ్యంగా వారి ప్రేమ, పెళ్లి విషయాలపై అభిమానుల్లో ఎప్పుడూ ఒక రకమైన క్యూరియాసిటీ ఉంటుంది. ఒక ఇంటర్వ్యూలో అనుష్క తన స్కూల్ రోజులను గుర్తుచేసుకుంటూ.. తనకు ఎదురైన మొదటి లవ్ ప్రపోజల్ గురించి మాట్లాడారు. తాను స్కూల్లో చదువుకునే రోజుల్లో ఒక అబ్బాయి తన ముందుకు వచ్చి ఎంతో ధైర్యంగా 'ఐ లవ్ యూ' అని ప్రపోజ్ చేశాడని స్వీటీ చెప్పుకొచ్చారు.ఆ వయసులో అసలు 'ఐ లవ్ యూ' అంటే పూర్తి అర్థం ఏంటో కూడా తనకు సరిగ్గా తెలియదని అనుష్క నవ్వుతూ ఒప్పుకున్నారు. అయితే ఆ అబ్బాయి అంత ధైర్యంగా వచ్చి తన మనసులోని మాట చెప్పేసరికి.. తనేమీ పెద్దగా ఆలోచించకుండా వెంటనే 'ఓకే' అని సమాధానం ఇచ్చేసినట్లు క్లారిటీ ఇచ్చారు. ఆ వయసులో ఉన్న అమాయకత్వం, అల్లరి వల్ల ఆ ప్రపోజల్‌ను చాలా లైట్‌గా తీసుకున్నానని, కానీ జీవితంలో ఆ క్షణాన్ని ఎప్పటికీ మర్చిపోలేనని ఆమె ఎమోషనల్‌గా పంచుకున్నారు.యోగా టీచర్‌గా కెరీర్ ప్రారంభించి, నాగార్జున 'సూపర్' సినిమాతో వెండితెరకు పరిచయమైన అనుష్క.. ఆ తర్వాత హీరోలతో సమానమైన స్టార్‌డమ్ సొంతం చేసుకున్నారు. ప్రస్తుతం 40 ఏళ్లు దాటినా ఆమె ఇంకా సింగిల్‌గానే ఉంటుండటంతో తరచూ ఆమె పెళ్లిపై రకరకాల రూమర్స్ వస్తూనే ఉంటాయి. ముఖ్యంగా కొందరు బిజినెస్‌మెన్‌లతో ఆమె పెళ్లి జరగబోతోందంటూ వచ్చే వార్తలను ఆమె టీమ్ ఖండిస్తూనే ఉంది. ప్రస్తుతం అనుష్క తెలుగులో వైవిధ్యమైన ప్రాజెక్ట్‌లతో బిజీగా ఉన్నారు. స్వీటీ పంచుకున్న ఈ స్కూల్ డేస్ క్రష్ స్టోరీ ఇప్పుడు నెటిజన్లను విపరీతంగా ఆకట్టుకుంటోంది.

# టాక్సిక్ సాంగ్ విషయంలో వివాదం..
### హీరోయిన్‌కు అండగా బ్రిటీష్ యాక్టర్




టాక్సిక్ సినిమా ప్రమోషన్ స్టార్ట్ అయిన దగ్గర నుంచి ఏదో వివాదం కొనసాగుతూనే ఉంది. ముఖ్యంగా తొలి టీజర్ విషయంలో తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. సెకండ్ టీజర్ ఒకే అనిపించినా... ఫస్ట్ సింగిల్‌తో మరోసారి చర్చ మొదలైంది. హీరోయిన్ కియారాను టార్గెట్ చేస్తూ సోషల్ మీడియా రచ్చ మొదలైంది. అసలు టాకి?్సక్ విషయంలో వివాదాలు కారణమేంటి..? ఈ కాంట్రవర్సీ మీద యూనిట్ రియాక్షన్ ఏంటి..? టాక్సిక్ సినిమా ప్రమోషన్ స్టార్ట్ అయిన దగ్గర నుంచే వివాదాలు షురూ అయ్యాయి. తొలి టీజర్‌లో బోల్డ్ కంటెంట్‌తో షాక్ ఇచ్చిన మూవీ టీమ్, ఆ తరువాత కూడా అదే ట్రెండ్ కంటిన్యూ చేస్తోంది. 'ఏ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్‌అప్స్' అనే ట్యాగ్ లైన్‌తో వస్తున్న ఈ సినిమా కంటెంట్ విషయంలో ఓన్లీ ఫర్ అడల్ట్స్ అన్న వార్నింగ్ ఇస్తోంది. రీసెంట్‌గా రిలీజ్ అయిన ఫస్ట్ సింగిల్ విషయంలో హీరోయిన్ కియారా మీద ట్రోల్స్ వైలర్ అవుతున్నాయి. పెళ్లి తరువాత కియారా ఇంత బోల్డ్‌గా నటించటం మీద సోషల్ మీడియాలో కామెంట్స్ వినిపిస్తున్నాయి. దీంతో యూనిట్ సభ్యులు కియారాకు మద్దతుగా కామెంట్స్ చేస్తున్నారు. అదే పాటలో నటించిన యష్‌కు కూడా పెళ్లైంది. కానీ ఆయనను హ్యాండ్సమ్ అని పొగుడుతూ కియారాను మాత్రమే ట్రోల్ చేయటం ఏంటి అంటూ ఫైర్ అయ్యారు నటుడు బెనెడిక్ట్. కేజీఎఫ్ 2 తరువాత లాంగ్ బ్రేక్ తీసుకున్న యష్, ఏరి కోరి టాక్సిక్ సినిమాను సెలెక్ట్ చేసుకున్నారు. మలయాళ దర్శకురాలు గీతూ మోహన్‌దాస్ రూపొందిస్తున్న ఈ సినిమా ఆగస్టు 26న ప్రేక్షకుల ముందుకు రానుంది. డ్రగ్స్ మాఫియా నేపథ్యంలో రూపొందుతున్న ఈ సినిమాను ఇండియన్ లాంగ్వేజెస్‌తో పాటు ఇంగ్లీష్‌లోనూ భారీగా రిలీజ్ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

Printed, Published and Owned by SITARALLA SRIRAMULU and Printed at M/s SRI DIVYA PRINTERS, Plot No. 33 & 34, 2nd Floor, Vasthu Colony, LB Nagar, Ranga Reddy, Telangana - 500074 and Published at H.No. 10-1-101/10. Bhagya Nagar Colony, Lingojiguda, Saroornagar, Ranga Reddy, Telangana - 500035. EDITOR: SITARALLA SRIRAMULU , RNI. No. TELTEL/2015/62524. Cell: 9966443465